



సాగర తీరంలో మత్స్యకార మహిళల పూజలు

సునామీ వచ్చి రెండు దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా విశాఖపట్నంలో మత్స్యకార మహిళలు గురువారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు నీటితో నింపిన కలశాలను అలంకరించి శిరస్సుపై పెట్టుకొని గంగమ్మను తలుచుకుంటూ పెదజాలరి పేట నుంచి ర్యాలీగా సముద్ర తీరానికి వెళ్లారు. అక్కడ పూజలు నిర్వహించారు. కలశాలలో తీసుకువెళ్లిన నీటిని సముద్రంలో కలిపారు. తమను చల్లగా చూడాలని, ఆగ్రహించవద్దని వేడుకున్నారు. సునామీ వచ్చినప్పటి నుంచి ఏటా డిసెంబరు 26వ తేదీన గంగమ్మ తల్లికి మత్స్యకార మహిళలు పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

పర్యాటకుల తాకిడి



సబ్ మెరైన్ మ్యూజియం వద్ద గురువారం బారులుతీరిన సందర్శకులు

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, మధ్యప్రదేశ్‌ల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. దీంతో ఆర్కే బీచ్ రోడ్డు సందడిగా కనిపిస్తోంది. విశాఖలో నేవీకి చెందిన కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142 విమానం, సీ హ్యారియర్ హెలికాప్టర్ మ్యూజియాలు ఒకే ప్రాంతంలో ఉన్నాయి. వాటిని చూడడానికి సందర్శకులు క్యూ కడుతున్నారు. ఆయా మ్యూజియాల వద్ద గురువారం బాగా రద్దీ పెరిగింది. రాత్రి ఎనిమిది గంటల వరకూ సందర్శకులను అనుమతించారు.

ఘనంగా సీపీఐ శతవార్షికోత్సవం



సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా గురువారం పార్టీ నేతలు బీచ్‌రోడ్డులో ఎర్ర జెండాలతో కవాతు నిర్వహించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

- 8లో

వచ్చే నెల 31 నుంచి అరకు ఉత్సవ్

పాడేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అరకు ఉత్సవ్‌ను జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. పర్యాటక ఉత్సవాలపై గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జనవరి 31,ఫిబ్రవరి 1, 2 తేదీల్లో అరకులోయ ఉత్సవాలు, ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో మారేడుమిల్లి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యాటక ఉత్సవాలను నిర్వహించేందుకు రూ.3 కోట్లు చొప్పున మొత్తం రూ.6 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు.

గ్రీన్ బెల్టును రాసిచ్చేశారు!

ఏఎస్ఎన్ షాపింగ్ మాల్‌కు అనుచిత లబ్ధి

హైవే నుంచి రెండు రహదారుల నిర్మాణానికి రూ.2 లక్షలు కట్టించుకుని అనుమతులు ఇచ్చేసిన ఎన్‌హెచ్ఏఐ

- ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- మాల్ యాజమాన్యం ఆధీనంలో రూ.18.66 కోట్ల విలువైన నగర పాలక సంస్థ భూమి
- పట్టించుకోని అధికారులు
- ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా చర్యలకు మీనమేషాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు'గా కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యవహరించింది. తనకు సంబంధం లేని వ్యవహారంలో నామమాత్రపు ఫీజు కట్టించుకుని అనుమతులు ఇచ్చి పడేసింది. సొంత భూమిని కాపాడుకోవలసిన జీవీఎంసీ మొక్కల లెక్కలు వేసిందే తప్ప బొక్కసానికి పడిన గండిని గుర్తించలేదు. ఏఎస్ఎన్ షాపింగ్‌మాల్ వ్యవహారంలో రెండు సంస్థలు కలిసి చేసిన మేలు ఇది..

కప్పరాడలో ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపాన జాతీయ రహదారిని ఆనుకుని అల్ట్రమం ఇంటర్నేషనల్ ట్రేడింగ్ కంపెనీ 'ఏఎస్ఎన్ మెగా మాల్' పేరుతో భారీ భవన నిర్మాణం చేపట్టింది. నిర్మాణం ముందు అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు పెట్టి అక్కడకు ప్రశ్నించేవారు ఎవరూ రాకుండా కట్టడి చేసేవారు. గతంలో వైసీపీ మంత్రి గుడివాడ అమర్ ఫొటో ఉపయోగించారు. ఇప్పుడు కూటమి నాయకులు ఫొటోలు పెట్టారు. ఈ విషయం తెలిసి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు రెండు వారాల క్రితం అక్కడికి వెళ్లారు. గ్రీన్ బెల్ట్ మొత్తం తొలగించేసి, ఆ భూమిని షాపింగ్ మాల్ భూమిలో కలిపేసుకొని సిమెంట్ ప్లాట్‌ఫారం నిర్మించిన విషయం గుర్తించారు. వెంటనే అక్కడి నుంచే జీవీఎంసీ

... మిగతా 6వ పేజీలో



ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపాన జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రీన్ బెల్టును తొలగించి నిర్మాణాలు చేపట్టిన మాల్ యాజమాన్యం

మెకానికల్ మాయాజాలం

జీవీఎంసీలో వాహనాల మరమ్మతు పేరిట ప్రజా ధనం దుర్వినియోగం

- ఎనిమిదేళ్ల కిందట కొనుగోలు చేసిన వాహనాల రిపేరుకు రూ.17 లక్షల చొప్పున ఖర్చు
- మెకానికల్ టెక్నికల్ అడ్వయిజర్ బంధువు షెడ్‌లో మరమ్మతులు
- రెండు నెలలు తిరగకుండానే మళ్లీ మొరాయింపు
- కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు



రూ.15 లక్షలుతో మరమ్మతుచేసి రెండు నెలలు కాకుండానే మళ్లీ షెడ్‌కు చేరిన వాహనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మెకానికల్ విభాగంలో కొంతమంది అధికారులు...కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వాహనాల రిపేరు పేరుతో అడ్డగోలుగా నిధులను స్వాహా చేస్తున్నారు. మరో రెండేళ్లలో జీవితకాలం ముగిసిపోయే వాహనాలకు రిపేర్ల కోసం రూ.లక్షల్లో వెచ్చిస్తున్నారు. అవి రెండు నెలలు తిరగకుండానే తిరిగి షెడ్డుకు చేరుతున్నాయి. రిపేర్లకు ఖర్చుపెట్టే మొత్తానికి మరికొంత కలిపి కొత్త కొనుగోలు చేస్తే ఐదారేళ్ల వరకూ ఎలాంటి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉండదనే విషయాన్ని అధికారులు విస్మరిస్తున్నారు.

నగరంలో ఇళ్ల నుంచి చెత్త సేకరణతోపాటు వాటిని ఆయా జోన్‌లోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు(ఎంఎస్ఎఫ్)లకు తరలించడం, అక్కడ నుంచి కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించడం కోసం 675 క్లాప్ వాహనాలు కాకుండా మరో 252 వాహనాలు ఉన్నాయి. ఆ 252 వాహనాల్లో కొన్ని 14 సీఎంటీ కాంపాక్టర్లు 15 కాగా మిగిలినవి క్లోజ్డ్ కాంపాక్టర్ కంటెయినర్లు, తారాస్ లారీలు, టిప్పర్లు వంటివి ఉన్నాయి. 14 సీఎంటీ సామర్థ్యం కలిగిన కాంపాక్టర్ వాహనాలను జీవీఎంసీ దాదాపు ఎనిమిదేళ్ల కిందట కొనుగోలు చేసింది. వాటి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (డ్రైవర్, ఇంధనం, రిపేర్లు) బాధ్యతలను టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగిస్తోంది. దీనికోసం ఏటా సుమారు రూ.40 లక్షల వరకు కాంట్రాక్టర్లకు చెల్లిస్తోంది. ఏడాదికాలానికి టెండర్లు అప్పగించినప్పుడు వాహనాన్ని కాంటాక్టర్ ఏ కండీషన్‌లో తీసుకుంటున్నారో...ఏడాది తర్వాత అదే కండీషన్‌లో అప్పగించాలి. ఒకవేళ టైర్లు అరిగిపోయినా, ఇంజన్ రిపేరు ఉన్నా, ఇతర నిర్వహణ లోపాలు ఉన్నా రిపేరు చేయించడానికి అయ్యే మొత్తాన్ని

... మిగతా 6వ పేజీలో

విమ్స్‌లో బ్లడ్ బ్యాంక్

- ప్రాథమిక అనుమతులు మంజూరు
- కేంద్ర ఔషధ నియంత్రణ శాఖకు ప్రభుత్వ ప్రతిపాదనలు
- బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు సంబంధించిన పనులు పూర్తి, పరికరాలు కొనుగోలు



విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో పూర్తిస్థాయి బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కానుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రక్తం అవసరమైతే హెల్త్ సిటీ లేదా నగరంలోని బ్లడ్ బ్యాంకులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ సమస్యను గుర్తించిన అధికారులు బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు విమ్స్ డైరెక్టర్ చర్యలను ప్రారంభించారు. రాష్ట్ర

... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు చెక్

రిజిస్ట్రేషన్ల శాఖ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు

జిల్లా రిజిస్ట్రార్ పరిశీలించాకే అనుమతి

- వీఎంఆర్‌డీఏ వద్ద కొనుగోలు చేసిన స్థలాలు ఇప్పటికీ 22-ఏ జాబితాలోనే...
- ప్రస్తుతం అమ్ముకోవాలంటే ఇబ్బందే...
- ఈ విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాల కోసం అధికారుల ఎదురుచూపు





(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రిజిస్ట్రేషన్ల శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎటువంటి ప్రభుత్వ భూమి అయినా సరే, గతంలో వాటిపై ఎన్ని లావాదేవీలు జరిగినా సరే...ఇప్పుడు మళ్లీ వాటిని విక్రయించాలంటే తప్పనిసరిగా జిల్లా రిజిస్ట్రార్ ఆమోదం తీసుకునేలా నిబంధనలు మార్చింది. ఈ మేరకు ఆ శాఖ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు కూడా చేసింది.

జిల్లాల అధికారులు గతంలో అందించిన ప్రభుత్వ భూముల జాబితాలు 22-ఏ, 22-ఏ-1-సి (దేవదాయ శాఖ) ప్రకారం సిస్టమ్‌లో అప్‌లోడ్ చేసింది. వాటికి సంబంధించి ఇప్పుడు ఎవరైనా రిజిస్ట్రేషన్‌కు వెళితే...దానిని సిస్టమ్ తిరస్కరిస్తోంది. 'జిల్లా రిజిస్ట్రార్ అనుమతి అవసరం' అని సూచిస్తోంది. దాంతో కక్షిదారులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ తంతు గత నాలుగు రోజులుగా నడుస్తోంది. అయితే ఇటువంటి వాటి విషయంలో ఎలా వ్యవహరించాలో రాష్ట్ర కార్యాలయం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. జనవరి ఒకటో తేదీ నుంచి భూముల విలువలు పెరుగుతున్నాయి. ఈ నాలుగు రోజుల్లో రిజిస్ట్రేషన్లు జరగకపోతే ఆ తరువాత స్టాంపు డ్యూటీ కింద ఎక్కువ మొత్తం కట్టాల్సి వస్తుంది. అందుకని కక్షిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకుముందు ఇలాంటి డాక్యుమెంట్లు వస్తే స్థానిక సబ్ రిజిస్ట్రార్ కక్షిదారులు సమర్పించిన ప్రభుత్వ ఉత్తర్వులు, పత్రాలు చూసి సంతృప్తి చెందితే రిజిస్ట్రేషన్ చేసేవారు. ఇప్పుడు ఆ అధికారం జిల్లా రిజిస్ట్రార్‌కు మాత్రమే ఇచ్చారు.

జగనన్న కాలనీలతో చిక్కు

విశాఖ జిల్లా వరకు చూసుకుంటే వీఎంఆర్‌డీఏ ఇంటి స్థలాలు, ఫ్లాట్లు విక్రయిస్తోంది. ఈ భూములన్నీ 22-ఏలోనే ఉంటాయి. వీఎంఆర్‌డీఏ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌కు పెడితే సబ్ రిజిస్ట్రార్లు అభ్యంతరాలు

... మిగతా 6వ పేజీలో

వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా లలిత్ బొహ్రా



లలిత్ బొహ్రా

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా లలిత్ బొహ్రా నియమితులయ్యారు. ఐఆర్ఎస్ అధికారి అయిన బొహ్రా ప్రస్తుతం డిప్యూటేషన్‌పై రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో పనిచేస్తున్నారు. ఇక్కడ డీఆర్ఎంగా పనిచేస్తున్న సౌరబ్ నెల క్రితం ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ముంబైలో సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. దాంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఆర్ఎంగా సాహు వ్యవహరిస్తున్నారు.

న్యూ ఇయర్ వేడుకల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ



- హోటళ్లు, క్లబ్‌ల, పబ్బుల నిర్వాహకులు ఒంటి గంటకల్లా కార్యక్రమాలు నిలిపివేయాలి
- డిసెంబరు 31వ తేదీ రాత్రి తెలుగుతల్లి ఫ్లైఓవర్ మూసివేత
- బీచ్‌రోడ్డులో డ్రోన్లతో నిఘా
- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): **నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించదలచుకున్న హోటళ్లు, పబ్బులు, క్లబ్‌లు తప్పనిసరిగా పోలీస్ అనుమతి తీసుకోవాలని సీపీ శంఖబ్రతబాగ్చీ స్పష్టంచేశారు. అనుమతి తీసుకున్నప్పటికీ ఏపీ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్-2013 ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు కార్యక్రమాలను నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. వేడుకలు నిర్వహించేవారు ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం, సామర్థ్యం మేరకు మాత్రమే టిక్కెట్లు విక్రయించడం, ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా పార్కింగ్ సదుపాయం కల్పించడం చేయాల్సి ఉంటుందన్నారు.**

వేడుకల్లో మద్యంసేవించిన వారిని ఇళ్లకు సురక్షితంగా చేర్చేందుకు వీలుగా డ్రైవర్లు, వాహనాలను నిర్వాహకులే ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుందన్నారు. వేడుకలకు హాజరయ్యేవారు ప్రవేశించడానికి, బయటకు వెళ్లడానికి వేర్వేరుగా మార్గాలను ఏర్పాటుచేయడంతోపాటు, సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. దంపతుల కోసం ఈవెంట్ నిర్వహించేవారు మైనర్లను అనుమతించడం నేరమన్నారు. అలాగే ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే మద్యం అందుబాటులో ఉంచాలని, మైనర్లకు అందకుండా చూసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వినియోగానికి ఆస్కారం లేకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం మత్తులో ఉన్న వారు స్విమ్మింగ్‌పూల్స్‌లో

... మిగతా 6వ పేజీలో



గోదాదేవికి 11వ పాశుర విన్నపాలు

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :సింహగిరిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవికి గురువారం 11వ పాశుర విన్నపాలు చేశారు.వేకువజామున ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో ఉంచారు. మంగళవాయిద్యాలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి బేడా మండపంలో తిరువీధి జరిపారు.అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై గ్రంథంలోని పదకొండవ పాశుర విన్నపాలు చేశారు. కొండదిగువన స్వామివారి పూదోటలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి, పూజలు చేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 3 లక్షల విరాళం

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి పలువురు దాతలు గురువారం విరాళాలు సమర్పించారు. భోగాపురానికి చెందిన వికాస్ వర్మ, వినోద్ వర్మ రూ.1 లక్ష, సీతమ్మధారకు చెందిన వానపల్లి సత్యానంద కిశోర్ దంపతులు రూ.1 లక్ష, నగరానికి చెందిన కేవీఎస్‌వీ రాజు,జ్యోతి దంపతులు రూ.1 లక్షలను నగదు రూపంలో ఏఈఓ ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి పద్మనాభ రాజుకు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాతలకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలదేవి సమేతంగా ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు భీమిలి విద్యార్థి

భీమునిపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ విద్యార్థి సుంకరి లోకేశ్ జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 20, 21 తేదీల్లో రాష్ట్రస్థాయి 10వ సబ్ జూనియర్ నెట్ బాల్ చాంపియన్ షిప్ 2024 పోటీలు కర్నూల్‌లోని డీఎస్‌ఏ అవుట్ డోర్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో లోకేశ్ ప్రతిభ చూపడంతో విశాఖ జట్టు ద్వితీయ స్థానంలో గెలుపొందిదని పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 28 నుంచి 31 వరకు తమిళనాడులోని ఆర్ఎంకే ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో లోకేశ్ పాల్గొనున్నట్టు ఆయన చెప్పారు.

'పరీక్షా పే చర్చ' పోస్టర్ ఆవిష్కరణ

కొమ్మాది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రులు పరీక్షా పే చర్చలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని పరీక్షలపై ప్రశ్నలను పంపించాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి అన్నారు. గురువారం ఆయన పాఠశాలలో పరీక్షా పే చర్చ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్ర, నాగేశ్వరరావు,శ్రీను, విజయ్‌కుమార్, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పీఎంపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

కొమ్మాది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈనెలాఖరుతో టీడీపీ సభ్యత్వ నమోదు పూర్తి కానున్నట్టు ఆరో వార్డు పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ తెలిపారు.గురువారం ఆయన పీఎంపాలెం కాలనీలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ సుభాని, కంచర్ల ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ

కొమ్మాది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న షిర్డీ సాయి ఆలయం వద్ద పేదలకు కాలనీకి చెందిన గొల్లంగి రోజమ్మ గురువారం రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం పలువురికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నింటి రాంబాబు, గొల్లంగి ఆనందబాబు, నారాయణరావు, దాసరి శ్రీనివాస్, పిల్లి పాపారావు, సర్వదేవుళ్ల, అజయ్‌కుమార్, గోవింద్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ల పనులు ప్రారంభం

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ 2వ ఫేజ్‌లో పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణం గురువారం ప్రారంభమైంది. ఇటీవల జరిగిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అప్రోచ్ రోడ్ల పనుల పూర్తికి రూ.35 లక్షలు మంజూరు చేశారు.

భక్తులతో సింహగిరి కిటకిట

- వందలాదిగా తరలివచ్చిన భవానీలు
- రద్దీగా ఆలయ పరిసరాలు
- వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు



కొండపై భక్తుల కోలాహలం

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :అప్పన్నస్వామి దర్శనానికి భవానీ భక్తులు గురువారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు బుధవారం రాత్రే టూరిస్టు బస్సుల్లో సింహాచలం చేరుకున్నారు. వేకువ జామున వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి సింహగిరికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భవానీలతో పాటు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వందలాది మంది కార్లలో సింహాద్రినాథుని దర్శనానికి రావడంతో సింహగిరి కిటకిటలాడింది. కొండపై ఖాళీ ప్రదేశాలన్నీ కార్లతో నిండిపోయాయి. ఒకదశలో ఘాట్ రోడ్డులో లోవతోటకు వెళ్లే మార్గంలో బస్సుల రాకపోకలకు అడ్డంగా కార్లు నిలిపివేయడంతో చాలాసేపు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.కాగా సింహగిరికి వస్తున్న పర్యాటకులు తమ బస్సులను బీఆర్‌టీఎస్ రోడ్డులో పార్కింగ్ చేస్తుండడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దేవస్థానం అధికారులు టూరిస్టు బస్సులను ఘాట్ రోడ్డులోకి అనుమతించడం లేదు. దీంతో బస్సులను కొండదిగువన పార్కింగ్ చేయాల్సి ఉంది. టూరిస్టు బస్సులకు కొండదిగువన సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ రోడ్డులో సింహాచలం ప్రధాన కూడలి నుంచి గోశాల వరకు ఉన్న రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. తక్షణమే దేవస్థానం అధికారులు బస్సులకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సంప్రదాయబద్ధంగా నారసింహ హవనం



హవనం చేస్తున్న అర్చకులు

సింహాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సుదర్శన, నారసింహ హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెలలో వచ్చే నృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతి పురస్కరించుకుని ప్రత్యేక హవనాన్ని నిర్వహించడం ఆనవాయితీ.ఈమేరకు గురువారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ముందుగా రంగవల్లులతో సిద్ధం చేసిన మండపంపై అధిష్ఠంపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ శాస్త్ర విధానంలో మండపారాధన, కలశారాధన, బింబారాధనలు చేసి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో అర్చకులు తొలుత పంచసూక్తాలతో, తరువాత నారసింహ, సుదర్శన మూల, మూర్తి మంత్రాలతో హవనాన్ని చేశారు. మహా పూర్ణాహుతి అనంతరం ప్రధాన కలశాన్ని అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ఉంచి పూజలు జరిపారు. హవనం ఏర్పాట్లను ఏఈఓ ఆనందకుమార్, ఈఈ శ్రీనివాసరాజు పర్యవేక్షించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఈ శ్యామ్‌బాబు

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన

ఆనందపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ విశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యామ్‌బాబు అన్నారు. గురువారం ఆయన గంభీరం పంచాయతీలో జరిగిన సోలార్ విలేజ్ అవగాహన సదస్సులో మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారుడికి 70 శాతం రాయితీ ఉండగా, మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణంగా అందిస్తాయని వివరించారు. ఇంటి అవసరాలకు వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆ ఆదాయంతో బ్యాంకు రుణం తీర్చుకోవచ్చన్నారు. దీనివల్ల కరెంట్ బిల్లు ఆదా కావడంతో పాటు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ప్రజలు సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, విద్యుత్ శాఖ ఈఈ పోలాకి శ్రీనివాసరావు, బ్యాంక్ లీడ్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో జానకి పాల్గొన్నారు.

తర్లువాడలో సినిమా షూటింగ్

ఆనందపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ గ్రామంలో రుణ విమోచన వినాయక గుడి వద్ద గురువారం 'పాన్ ఇండియా' సినిమా షూటింగ్ జరిగింది. దేవి మూవీస్ ప్రె జెంట్స్ ప్రొడక్షన్ నెంబరు-2లో నిర్మిస్తున్న ఈ సినిమాలో లోకల్ బాయ్ రోహన్ హీరోగా నటిస్తుండగా డైరెక్టర్‌గా వెంకట్ పంపాన, నిర్మాతగా రాజా సాగి సత్యన్నారాయణరాజు, మ్యూజిక్ డైరెక్టర్‌గా డీఎస్ ఆర్ బాలాజీ వ్యవహరిస్తున్నారు. ఇండియన్ స్టార్ మేకర్ లంక సత్యానంద్, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు క్లాప్ కొట్టి, షూటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మజ్జి వెంకటరావు, తాత్రాజు అప్పారావు, కంటుభక్త రాంబాబు, బంకు రాజు తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ మాయాజాలం

... 5వ పేజీ తరువాయి

సదరు కాంట్రాక్టర్ బిల్లు నుంచి జీవీఎంసీ మినహాయించి కొత్త కాంట్రాక్టర్‌కు అందజేయాల్సి ఉంటుంది. అయితే మెకానికల్ విభాగం అధికారులు వాహనాల నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) టెండర్లు పిలిచినప్పుడు ఆ విషయాన్ని సరిగా పట్టించుకోకపోవడంతో ఎనిమిదేళ్ల కిందట కొనుగోలు చేసిన 14 సీఎంటీ కాంపాక్టర్ వాహనాలు మూలకు చేరిపోయాయి. ఆయా వాహనాల జీవితకాలం మరో రెండేళ్లు మాత్రమే ఉన్నప్పటికీ అధికారులు మాత్రం వాటికి రిపేరు చేయించి తిరిగి రోడ్డుపై తిప్పాలని నిర్ణయించారు.

రూ.17 లక్షలతో మరమ్మతు చేయిస్తే...

14 సీఎంటీ కాంపాక్టర్లు పదిహేను కూడా మరమ్మతులకు గురవడంతో అధికారులు రిపేర్లకు టెండర్లు పిలిచారు. ఒక్కో వాహనానికి రూ.17 లక్షల ఖర్చుతో రిపేర్లు చేసేలా నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. వీటిలో ఏడు వాహనాలు మరమ్మతులు పూర్తిచేసుకుని రెండు నెలల కిందట జీవీఎంసీకి చేరాయి. వీటి నిర్వహణకు కొత్తగా టెండర్లు పిలవడంతో వేర్వేరు వ్యక్తులు టెండర్ దక్కించుకున్నారు. అయితే రూ.17 లక్షలు ఖర్చుపెట్టిన వాహనాల ఇంజన్‌లు మొరాయిస్తుండడంతో వాటి నిర్వహణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు రిపేర్లు చేయించుకుంటున్నారు. అయితే ఒక వాహనం ఇంజన్ బాగా దెబ్బతినడంతో దానికి రూ.నాలుగు లక్షలకు పైగా ఖర్చు అవుతుందని మెకానిక్ అంచనా వేయడంతో సదరు కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో మెకానికల్ అధికారులే ఆ వాహనాన్ని జ్ఞానాపురంలోని ఒక ప్రైవేటు గ్యారేజీకి పంపించి రిపేరు చేయించే బాధ్యతను తీసుకున్నారు. కొత్తవాహనం ఖరీదు సుమారు రూ.50 లక్షలు ఉంటుందని, మూలకు చేరిన వాహనానికి రూ.20 లక్షలు వెచ్చించి రిపేరు చేసినా మరో రెండేళ్లకు మించి తిరగదని తెలిసి కూడా అధికారులు రూ.కోట్లు ఖర్చుపెట్టడం ఏమిటని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీవీ వామనరావు ప్రశ్నించారు. రిపేర్లకు ఖర్చుపెట్టే డబ్బుకి మరో రూ.30 లక్షలు ఖర్చుపెడితే కొత్తవాహనం వచ్చేస్తుందని, కొత్తవాహనానికి కనీసం ఐదేళ్లు రిపేర్లు లేకుండా పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల చెత్తసేకరణ, తరలింపులో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా పనిచేయవచ్చునన్నారు.

మెకానికల్ టెక్నికల్ అడ్వైజర్ ఏంచేస్తున్నారో మరి:

జీవీఎంసీ మెకానికల్ విభాగంలో వాహనాల రిపేర్లలో అక్రమాలకు చోటులేకుండా పారదర్శకంగా అంచనాలు తయారుచేసేందుకు వీలుగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఒకరిని టెక్నికల్ అడ్వయిజర్‌గా నియమించారు. సుమారు రూ.50 వేలు గౌరవ వేతనంతోపాటు ఒక కారు, డ్రైవర్, నెలకు 200 లీటర్లు ఇంధనం జీవీఎంసీ ఇస్తోంది. ఎనిమిదేళ్ల జీవితకాలం పూర్తయిన 15 వాహనాలను దాదాపు రూ.17 లక్షలు చొప్పున ఖర్చు పెట్టి మరమ్మతు చేయించాలని సదరు అడ్వయిజర్ సూచించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఆ వాహనాల రిపేర్లు కూడా విజయవాడలో తనకు తెలిసిన వ్యక్తి గ్యారేజీలోనే చేయించాలని షరతు పెట్టినట్టు సమాచారం.



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో దాత శ్రీరామచంద్రమూర్తి, తదితరులు

హిందీ పరీక్షల పుస్తకాలు పంపిణీ

భీమునిపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు తమ సంస్థ ఎల్లవేళలా సహాయం అందిస్తుందని స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దక్షిణ భారత హిందీ మహాసభ చెన్నై వారు నిర్వహించే హిందీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఎం పొన్నగంటి రమణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నూకరాజు కోరిక మేరకు 400 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్‌లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమి మండలి అధ్యక్షుడు కృష్ణారావు, ఉపాధ్యాయులు సతీశ్, నానాజీ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

'సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి'

కొమ్మాది, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలో ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మధురవాడ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వారు కొమ్మాది కూడలి నుంచి కార్‌షెడ్ జంక్షన్, అక్కడి నుంచి కొమ్మాది జంక్షన్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించి, అనంతరం సుజాతనగర్‌లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్మికులు, ప్రజలు భారీగా తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పలరాజు, ఎస్. రామప్పడు, సీహెచ్ శేషుబాబు, కిరణ్, విజయ్, రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

కోరాడలో రెవెన్యూ సదస్సు



సదస్సులో వినతి స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి సుధాసాగర్

పద్మనాభం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుధాసాగర్ చెప్పారు. గురువారం కోరాడ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని చెప్పారు. ఎటువంటి రుసుము లేకుండానే సదస్సులో వచ్చిన వినతులకు పరిష్కారాలు చూపుతామన్నారు. అనంతరం ప్రజల నుంచి 27 వినతులు స్వీకరించారు. వీటిలో మ్యుటేషన్ కోసం 18, ధ్రువీకరణ పత్రాల కోసం 4, సర్వే కోసం 5 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనందరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ కనకబాబు, సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, పాల్గొన్నారు.

పీఎంపాలెం కూడలిలో లారీపై మంటలు

ఎండాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరం నుంచి మధురవాడ వైపు లోడుతో వెళుతున్న లారీకి పీఎంపాలెం కూడలిలో మంటలు అంటుకున్నాయి. లారీపై ఉన్న టార్పలిన్ నుంచి మంటలు రావడంతో అటుగా వెళ్లే వాహనదారులు చూసి, లారీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే వారు మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని పలువురు భావిస్తున్నారు.

బుడ్డివలసలో నేత్ర వైద్య శిబిరం

పద్మనాభం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా బుడ్డివలసలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖ జోన్ రెండవ గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు 60 మందిని పరీక్షించారు.

నేడు వైసీపీ 'పోరుబాట'

భీమునిపట్నం రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైసీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు తగరపువలస బైపాస్ రోడ్డు వద్దకు నాయకులు, కార్యకర్తలు చేరుకోవాలని చెప్పారు.

మైనింగ్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

ఆనందపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసులువాడలో మైనింగ్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ అధికారులు ఈనెల 28న సర్వే నెంబరు 104లో తెల్లకొండ (ఎద్దుకొండ)పై మైనింగ్ తవ్వకాలు నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణకు సన్నాహాలు చేస్తున్నారని, దీన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే వారి ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. బ్లాస్టింగ్ రహిత అనుమతులని ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం కుసులువాడ, చిన్నయ్యపాలెం, ఇచ్ఛాపురం, రేగానిగూడెంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు నాగరాణి, షిణగం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం బైక్ ర్యాలీ

మైనింగ్ తవ్వకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారు. శుక్రవారం ఉదయం కుసులువాడ, చిన్నయ్యపాలెం, ఇచ్ఛాపురం, రేగానిగూడెం గ్రామాల్లో ఈ ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువకులు, స్వచ్ఛంద సంస్థలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

మధురవాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా హక్కుల కోసం పోరాడే పార్టీ సీపీఐ అని పార్టీ మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ అన్నారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన మధురవాడ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న సీపీఐ ఆవిర్భవించిందని, నాటి నుంచీ ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, త్రినాథ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి సీపీఐ చేసిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని పార్టీ సీనియర్ నాయకుడు అల్లు బాబూరావు అన్నారు. చిట్టివలస జీఆర్ భవన్ వద్ద ఆయన పార్టీ పతాకావిష్కరణ చేశారు. కొండా ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మావూరి సన్యాసిరావు, మోర అప్పలరాజు, కానూరి రాంబాబు, నువ్వుల ఆదినారాయణ, సన్నిబాబు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ బెల్టును రాసిచ్చేశారు!

... 5వ పేజీ తరువాయి

కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరోజు సాయంత్రమే జీవీఎంసీ సిబ్బంది వెళ్లి గ్రీన్ బెల్ట్‌లో కొన్ని నిర్మాణాలను నామమాత్రంగా తొలగించారు. అయితే యాజమాన్యం తమకు అనుమతులు ఉన్నాయంటూ కొన్ని పత్రాలు చూపించింది. దాంతో వారు వెనక్కి తగ్గారు.

ఆశ్చర్యపోయే వాస్తవాలు

హైవే సర్వీస్ రోడ్డు నుంచి షాపింగ్ మాల్‌లోకి రాకపోకలు సాగించడానికి గ్రీన్ బెల్ట్ మధ్య నుంచి మార్గం వేసుకోవడానికి భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)ను యాజమాన్యం అనుమతి కోరింది. వెళ్లడానికి రెండు మార్గాలు, రావడానికి రెండు మార్గాలు కావాలని విజయవాడ అధికారులకు లేఖ రాసింది. ఆగమేఘాలపై అనుమతి ఇచ్చారు. ఒక్కో మార్గం 40 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవుతో వేసుకోవచ్చునని సూచించారు. దీనికి కేవలం రూ.2 లక్షలు రుసుము కట్టించుకున్నారు. కొన్ని నిబంధనలు విధించారు. గ్రీన్ బెల్ట్ తొలగించడానికి అవసరమైన అనుమతులు అటవీ శాఖ నుంచి తీసుకోవాలని చెప్పారు. రాకపోకలకు ఉపయోగించుకునే భూమి ఎవరిదైతే వారితో యాజమాన్య వివాదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అంటే ఆ భూమి తమది కాదని పరోక్షంగా సూచించారు.గ్రీన్ బెల్ట్ నిర్వహిస్తున్న జీవీఎంసీదే అని పరోక్షంగా చెప్పారు.

ఎంత భూమి ఇచ్చారంటే...?

ఒక్కో రోడ్డు 40 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవు. ఇలాంటివి నాలుగు రోడ్లు. వెళ్లడానికి రెండు, తిరిగి రావడానికి రెండు. ఈ రహదారుల విస్తీర్ణం 160 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవు. అంటే 11,200 చదరపు అడుగులు. ఇది 1,244 చదరపు అడుగులకు సమానం. అక్కడ చదరపు అడుగు భూమి విలువ రూ.1.5 లక్షలు ఉంది. అంటే ఈ భూమి విలువ రూ.18.66 కోట్లు. అంత విలువైన భూమిని ఉపయోగించుకుంటున్నప్పుడు దానికి లీజు మొత్తం జీవీఎంసీకి ఏడాదికి ఓసారి కట్టాలి. ముందుగా అడ్వాన్స్ కొంత చెల్లించాలి. కానీ దీనిపై ఇరువర్గాల మధ్య ఎటువంటి ఒప్పందం లేదు. ఉదారంగా ఇచ్చేశారు.

గ్రీన్‌బెల్ట్ మళ్లీ అభివృద్ధి చేయాలి..కానీ ఎలా..?

ఈ మాల్ వ్యవహారంలో జీవీఎంసీ కూడా గ్రీన్ బెల్ట్ తొలగింపునకు అనుమతి ఇచ్చింది. అయితే ఎన్ని చెట్లు, మొక్కలు తొలగిస్తే వాటికి ఐదు రెట్లు మళ్లీ వేయాలని నిబంధన పెట్టింది. అదే స్థలంలో మళ్లీ గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేయాలని, దానికి రూ.43.3 లక్షలు వ్యయం అవుతుందని పేర్కొంది. అయితే నాలుగు రహదారుల నిర్మాణానికి అవసరమైన మేరకు గ్రీన్ బెల్ట్ తొలగించాలి. కానీ యాజమాన్యం మొత్తం తొలగించేసింది. మళ్లీ అక్కడ గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడానికి వీల్లేకుండా సిమెంట్ ప్లాట్‌ఫారం నిర్మించేసింది. అనుమతించిన ఏరియాను మార్గం కోసమే వినియోగించాలని నిర్మాణాలకు, పార్కింగ్‌కు ఉపయోగించకూడదని జీవీఎంసీ నిబంధన పెట్టింది. కానీ అక్కడ పార్కింగ్‌కు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రహదారుల ఏరియాలో నీరు పోవడానికి వీలుగా కాలువ ఉండాలని, దానికి మ్యాన్‌హోళ్లు ఉండాలని చెబితే...జీవీఎంసీకి చెందిన స్థలంలోనే కాలువ నిర్మించడం విశేషం.

ఏమి ముట్టాయో తెలియదు?

ఈ వ్యవహారంలో ఎన్‌హెచ్ఏఐ, జీవీఎంసీ అధికారులకు ఏం ముట్టాయో తెలియదు కానీ అడ్డగోలుగా సహకరిస్తున్నారు. గ్రీన్‌బెల్ట్ మధ్య నుంచి రోడ్లు అని చెప్పి మొత్తం మొక్కలు, చెట్లు తీసేశారు. దీనికి ఎవరి నుంచీ అనుమతులు తీసుకోలేదు. కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాన్ని ఉదారంగా వాడుకోవడానికి ఇచ్చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటున్నారు తప్పితే తప్పులను సవరించే ప్రయత్నం చేయడం లేదు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఊరుకోబోమంటూ పత్రికా ప్రకటనలు గుప్పించే అధికారులు, నేతలూ నోళ్లు మెదపడం లేదు. ఎందుకో మరి.

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

చెప్పేవారు కాదు. అలా అప్పట్లో వీఎంఆర్‌డీఏ వద్ద కొనుక్కొని ఇప్పుడు ఎవరైనా వాటిని తిరిగి అమ్మాలనుకుంటే...అవి కూడా 22-ఏలో కనిపిస్తున్నాయి. వాటికి కూడా జిల్లా రిజిస్ట్రార్ అనుమతి అవసరం అని చూపిస్తోంది. అదేవిధంగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములు కూడా 22-ఏలో ఉన్నాయి. ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి వాటిని తిరిగి కొనుక్కున్న వారికి కూడా ఇప్పుడు రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. అయితే గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేదలకు 'సెంటు భూమి' ఇచ్చింది. వారి ఆర్థిక అవసరాలకు ఆ భూమిని ఎప్పుడైనా అమ్ముకునే వెసులుబాటు కల్పించింది. దానిని ఆసరాగా చేసుకొని వైసీపీ నేతలు చాలామంది లబ్ధిదారుల పేరిట రిజిస్టర్ అయిన భూములను నెల రోజులకే, కొందరైతే మరుసటిరోజే తమ బినామీల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిపై ఆరా తీస్తుండడంతో వాటిని ఏదో ఒక రేటుకు అమ్మేసి బయటపడాలని యత్నిస్తున్నారు. ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్లు ఆపడానికే ప్రభుత్వం 'జిల్లా రిజిస్ట్రార్ అనుమతి' అవసరం అనే నిబంధన విధించింది. జగనన్న కాలనీలు కూడా 22-ఏలోనే ఉన్నాయి. వాటిని పరిశీలించి, నిజమైన లబ్ధిదారులు అమ్ముతున్నారా?, బినామీలు అమ్ముతున్నారా?...అనేది పరిశీలించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ క్రమంలో ప్రభుత్వ సంస్థల నుంచి భారీగా డబ్బులు పెట్టి ప్లాట్లు కొన్నవారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై వెంటనే రాష్ట్ర అధికారులు మార్గదర్శకాలు జారీచేయాల్సి ఉంది.

విమ్స్‌లో బ్లడ్ బ్యాంక్

... 5వ పేజీ తరువాయి

స్థాయి కమిటీ బ్లడ్ బ్యాంకు అవసరాన్ని గుర్తించడంతోపాటు వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేంద్రస్థాయిలో అనుమతులకు ఔషధ నియంత్రణ మండలి విభాగానికి సమాచారం పంపించింది. కొద్దిరోజుల్లోనే అనుమతులు వస్తాయని భావిస్తున్నారు.

పనులు పూర్తి..

బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు విమ్స్ మొదటి అంతస్థులో సుమారు ఏడు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. దీంతో రక్త శుద్ధి, నిల్వ, పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేశారు.

రోగులకు మేలు

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

విమ్స్‌లో బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జిల్లా ఔషధ నియంత్రణ మండలితోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ప్రాథమిక అనుమతులు ఇచ్చాయి. కేంద్రం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే సేవలను ప్రారంభిస్తాం. విమ్స్‌లో ప్రతిరోజూ 30 వరకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. వీరిలో కనీసం ఐదుగురికి రక్తం అవసరం అవుతుంది. హెల్త్ సిటీలోని ఇతర ఆస్పత్రులకు కూడా విమ్స్‌లో ఏర్పాటయ్యే బ్లడ్ బ్యాంకు ఉపయోగపడుతుంది. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కీలకంగా మారుతుంది.

న్యూ ఇయర్ వేడుకల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

దిగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకల పేరుతో అశ్లీల నృత్యాలు ప్రదర్శించడం, బాణసంచా కాల్చడం, మితిమీరిన శబ్దం వచ్చేలా సౌండ్ సిస్టమ్ ఏర్పాటుచేయడం చేస్తే కేసులు నమోదు చేస్తామని సీపీ హెచ్చరించారు.

హద్దు మీరితే కేసులే

కొత్త సంవత్సరం వేడుకల పేరుతో ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే కేసులు నమోదుచేస్తామని సీపీ హెచ్చరించారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి ఎనిమిది నుంచి జనవరి ఒకటో తేదీ ఉదయం ఐదు గంటల వరకూ తెలుగుతల్లి ఫ్లైఓవర్ తోపాటు జీవీఎంసీ అండర్‌పాస్ రోడ్డును మూసివేస్తామన్నారు. అలాగే మద్దిలపాలెం నుంచి రామాటాకీస్, హనుమంతవాక నుంచి ఎన్ఏడీ జంక్షన్, గోశాల జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకూ బీఆర్‌టీఎస్ రోడ్లు మూసివేస్తామన్నారు. అత్యవసరమైనవారు రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డులో వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఆకతాయిలకు చెక్ చెప్పేందుకు నోవాటెల్ జంక్షన్, ఆర్కే బీచ్, భీమిలి, గాజువాక, పెందుర్తి పరిసరాల్లో షీటీమ్స్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. బీచ్‌రోడ్డులో జనాలను 12 గంటల తరువాత బయటకు పంపించేస్తామని, అక్కడ బాణసంచా కాల్చేవారిని, శుభాకాంక్షలు చెప్పే పేరుతో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించేవారిని గుర్తించడం కోసం డ్రోన్లతో నిఘా పెడుతున్నామన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లతో వాహనాలను నడపడం, అపరిమిత వేగంగా వాహనాలను నడపడం వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎక్కడికక్కడ పోలీస్ బీట్లు ఏర్పాటుచేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే వాహనం సీజ్ చేయడంతోపాటు కోర్టులో హాజరుపరచడం, లైసెన్స్‌ను మూడు నెలలు రద్దు చేయడం జరుగుతుందని సీపీ హెచ్చరించారు. ప్రజలంతా సురక్షితంగా ఉండే మార్గంలో వేడుకలు జరుపుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

జూ అభివృద్ధికి కృషి

» క్యూరేటర్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన మంగమ్మ



బాధ్యతలు స్వీకరిస్తున్న మంగమ్మ

ఆరిలోవ, డిసెంబరు 26 : (ఆంధ్రజ్యోతి) క్యూరేటర్‌గా జూ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గురువారం పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన జి.మంగమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూకు వివిధ జంతువులను కొత్తగా తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జూ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్గశిరమాసం ఆఖరి గురువారం సందర్భంగా ఆరిలోవలో గల ఎస్‌కెఎల్‌ఎం నగర్‌లో వెలిసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గురువారం వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో విచ్చేసిన మహిళలు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిటకిట లాడింది. భక్తులందరికీ ఉచితంగా ప్రసాదాలను ఆలయ కమిటీ అందజేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన్ని ప్రాంతాలకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు జోన్-3 (ఆపరేషన్స్) ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ఎస్‌ఎస్‌ఎన్ నగర్, కామాక్షి నగర్, సీఐడీ కార్యాలయం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం బ్లాక్స్, శ్రీకాంత్‌నగర్ లే అవుట్, కనక మహాలక్ష్మి కాలనీ, రాజీవ్‌నగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్, టీబీసీ పాయింట్, ఆరిలోవ ఆఖరి బస్టాప్, పాండురంగపురం, నెహ్రూనగర్, దుర్గా బజార్, లక్ష్మీనగర్, శివాజీ నగర్, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2 :** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 22, వంకాయలు (తెలుపు)40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 42, బీరకాయలు 56, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 24, క్యారెట్ 42 దొండకాయలు 48, బంగాళ దుంపలు 28, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది) 56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 60, కీరదోస 38, కాప్సికమ్56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 60, దేముడు చిక్కుడు 44, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	125
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

రోడ్డు పక్కనే నిర్మాణ వ్యర్థాలు

» మలేరియా సబ్ యూనిట్ పాత కార్యాలయం రోడ్డులో రాత్రి వేళల్లో డంపింగ్
» స్పందించని అధికారులు
» స్థానికుల ఇబ్బందులు



మలేరియా సబ్ యూనిట్ పాత కార్యాలయం రోడ్డులో రోడ్డు పక్కనే భారీగా పడి ఉన్న నిర్మాణ వ్యర్థాలు

మద్దిలపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో మలేరియా సబ్ యూనిట్ పాత కార్యాలయం రోడ్డు డంపింగ్‌యార్డ్‌ను తలపిస్తోంది. రోడ్డు మొత్తం చెత్తకుప్పలతో నిండిపోయింది. నగరంలో డంపింగ్ యార్డులున్నా సరే ఇక్కడ వ్యర్థాలు కుప్పలుగా పడేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలు లారీల్లో రాత్రి వేళల్లో తీసుకొచ్చి గతంలో మలేరియా సబ్ యూనిట్ ఉన్న రోడ్డులో డంప్ చేస్తున్నారు. ఒకప్పుడు ఇక్కడ ఇసుక వ్యాపారం నిర్వహించేవారు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ వ్యాపారాలను తొలగించారు. అదే ప్రాంతంలో ఉన్న టీ, టిఫిన్ దుకాణాలను కూడా తీయించారు. దీంతో రోడ్డు ఖాళీ అయింది. అయితే ఈ ప్రాంతాన్ని ఇప్పుడు భవన నిర్మాణ వ్యర్థాలతో డంపింగ్ యార్డ్‌లా మార్చేశారు. పాత ఇళ్లు విరగ్గొట్టి మళ్లీ నిర్మాణ పనులు చేపట్టినప్పుడు లారీల కొద్ది వ్యర్థాలు వస్తాయి. ఈ నిర్మాణ వ్యర్థాలను తరలించడానికి లోడుకు రూ.4 వేలు వరకు తీసుకుంటారు. ఈ వ్యర్థాల లోడును నగర శివారులోని పరదేశీపాలెం వద్ద డంప్ చేయడానికి యార్డ్ ఏర్పాటు చేశారు. అంత దూరం వెళ్లకుండా నగరంలో నిర్మానుష్య ప్రాంతాల్లో ఈ విధంగా డంప్ చేస్తున్నారు. ఈ తతంతం రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతుండడంతో ఎవరూ అడ్డుకునే వీలు లేకుండా పోతోంది. మద్దిలపాలెం, శివాజీపాలెం, రేసపువానిపాలెం ప్రాంతాల నుంచి భవన నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేస్తున్నారు. స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యర్థాలు డంపింగ్ యార్డ్‌లకు తరలించకుండా పిఠాపురంకాలనీ రోడ్డులో డంప్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి బయట చెత్త వేస్తే రూ.5 వేలు వరకు జరిమానాలు విధించే జీవీఎంసీ శానిటేషన్ అధికారులు రోడ్డుపై గుట్టలుగా వ్యర్థాలు పోసిన చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడుతున్నారు. రోడ్డును డంపింగ్ యార్డ్‌లుగా మార్చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని చెత్తకుప్పలు తొలగించాలని కోరుతున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

మద్దిలపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి సమీపంలోని సుజాతనగర్‌లో ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించే సీపీఎం బహిరంగసభ విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్కేఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలను ప్రచారం చేస్తూ గురువారం పిఠాపురం కాలనీ కళాభారతి వద్ద సీపీఎం కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీపాలెం, డాక్టర్స్ కాలనీ, వాల్తేరు, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, ఇసుకతోట, భానునగర్, సీతమ్మధార మీదుగా తిరిగి కళాభారతి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ 28న ప్రదర్శన అనంతరం బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. గత మూడేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై చేసిన పోరాటాలపై సమీక్షించి, రాబోయే మూడేళ్లలో ప్రజా పోరాటాల ప్రణాళిక రూపొందిస్తారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగపరిశ్రమల పరిరక్షణ, కార్మిక చట్టాలు, విద్యుత్ భారాలపై పెద్ద ఎత్తున పోరాటాలకు ఈ సభ సన్నద్ధమవుతుందన్నారు. ఈ ర్యాలీలో సీపీఎం నాయకులు వి.కృష్ణారావు, నరేంద్రకుమార్, పి.వెంకటరావు, కె.కుమారి, అనపర్తి అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం



పతాకావిష్కరణ చేస్తున్న రెహమాన్ తదితరులు

ఆరిలోవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర సంగ్రామంలో భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ సాయుధ పోరాటం చేసి నాలుగు వేల మంది అమరులైనా సుమారు 10 లక్షల ఎకరాలను పేదలకు పంచిన ఘనత సీపీఐకి దక్కిందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యదర్శి ఎస్కే. రెహమాన్ పేర్కొన్నారు. గురువారం భగత్‌సింగ్ నగర్‌లో సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకూ సీపీఐ అనేక పోరాటాలు చేసిందని, ఎప్పుడూ ప్రజల పక్షమే నిలిచిందన్నారు. అలుపెరుగని పోరాటాలు చేయడమే సీపీఐకి తెలుసు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడినా ముందుండి పోరాడేది సీపీఐ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు ఎస్.దేవుడమ్మ, ఆరిలోవ కార్యదర్శి కె.లక్ష్మణరావు, సహాయకార్యదర్శి సీహెచ్ కాసుబాబు, ప్రజా నాట్య మండలి సభ్యుడు చిరంజీవి, ఏఐవైఎఫ్ నాయకులు కె.సందీప్, మహిళా సమాఖ్య నాయకురాలు పి.పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..



సీపీఐ పతాకావిష్కరణ చేస్తున్న గోవింద్

వెంకోజీపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా సీపీఐ 15వ వార్డు ఇన్‌చార్జి పడాల గోవింద్ హెచ్‌బీ కాలనీలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సీపీఐ అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అలాగే ప్రభుత్వాలు సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించాలని ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సీపీఐ శతజయంతి వార్షికోత్సవం సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్.మధురెడ్డి, రావి అశోక్, లక్ష్మణ్‌రెడ్డి, శ్రీను, కన్నారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణ ప్రణాళికపై ఫిర్యాదు స్వీకారం

వెంకోజీపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించడం జరుగుతుందని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన అధికంగా ప్రజల నుంచి ఫిర్యాదులు/ వినతులు వస్తున్నాయని కమిషనరు తెలిపారు. కావున పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులను, వినతులను ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు ప్రత్యేకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వీకరిస్తారని కమిషనరు తెలిపారు. కాబట్టి ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

సమగ్రాభివృద్ధి చేపట్టాలి

రాష్ట్రాభివృద్ధిపై చర్చ వెబ్‌నార్‌లో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ



వెబ్‌నార్‌లో పాల్గొన్న అజశర్మ, ఈఏఎస్ శర్మ, ప్రొఫెసర్ కేఎస్ చలం, డాక్టర్ వై.కృష్ణమూర్తి, గంటేడ గౌరునాయుడు, ఎం.శ్రీనివాసా, బద్రి కూర్మారావు, ఉప్పల అప్పలరాజు తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన తరువాత కూడా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు, ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందలేదు సరికదా మరింత వెనుకబాటులోని నెట్టబడ్డాయని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అజశర్మ అధ్యక్షతన జరిగిన వెబినార్ సమావేశంలో ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 46(3) ప్రకారం వెనుకబడిన ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కేంద్రం ఇవ్వకపోవడం, ప్రత్యేక హోదా నిరాకరించడం, విభజన చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడమే అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా రాష్ట్రంలోని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని విమర్శించారు.

సెమినార్‌లో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన, చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్ ప్లాంటును సైతం అమ్మేయాలని నిర్ణయించిందని, దీన్ని అడ్డుకోవడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనికి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ప్రైవేటు రంగంలో మిట్టల్ స్టీల్‌ప్లాంటు, దానికి అనుసంధానంగా ఒక పోర్టు నిర్మిస్తామని ప్రకటించడం కచ్చితంగా విశాఖ స్టీల్‌ప్లాంటును బలహీనపరచాలన్న కుటిల యత్నమే అని ఆరోపించారు. ఎస్సీ ఎస్టీ తరగతుల రిజర్వేషన్లు కూడా పోయి, రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయానికి విఘాతం కలుగుతుందన్నారు. వెంటనే ఆ ప్రతిపాదన విరమించుకుని, కడపలో ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమతౌల్య అభివృద్ధి ద్వారానే స్థిరమైన అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. చాలా గిరిజన ప్రాంతాల్లో నేటికీ రోడ్లు, తాగు నీరు వంటి కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 94(3) ప్రకారం రాజధాని నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రాజ్‌భవన్, రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి నిర్మాణ బాధ్యత మొత్తం కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. కానీ ఆ దిశలో రాష్ట్ర ప్రభుత్వం కృషి కనిపించడం లేదన్నారు. కేంద్రం నుంచి చట్ట ప్రకారం హక్కుగా రావాల్సిన నిధులు రాబట్టకుండా, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో వంటి సంస్థల ద్వారా భారీగా అప్పులు చేసి నిర్మించడమంటే, మరలా రాష్ట్రం మీద అప్పుల భారం పెరగడమే, కేంద్ర నుంచి హక్కుగా రావాల్సిన నిధులు రాబట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్ర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అన్ని ప్రాంతాలను మాటాలలో కాకుండా చేతులలో అభివృద్ధి చేసే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలన్నారు. చట్ట ప్రకారం పూర్తి స్థాయి నిధులు కేంద్రం నుంచి సమీకరించి, సామాన్యుల గోడు విని, రాజ్యాంగ విలువలకు కట్టుబడి, సామాన్యుల రాజధాని, సమతుల్య అభివృద్ధి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ, ప్రొఫెసర్ కేఎస్ చలం, పర్యావరణ వేత్త డాక్టర్ వై.కృష్ణమూర్తి, ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు, ఎం.శ్రీనివాసా, బద్రి కూర్మారావు, ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



మృతి చెందిన జరీనా బేగం

కూర్మన్నపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో ఓ మహిళ జారిపడి మృతి చెందింది. ఈ సంఘటన దువ్వాడ రైల్వే స్టేషన్ ఒకటో ప్లాట్‌ఫామ్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా వున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా నగరానికి చెందిన జరీనా బేగం (44) గుండె వైద్యం కోసం బెంగళూరు మణిపాల్ ఆస్పత్రికి బయలుదేరింది. చిన్న కుమార్తె, పెద్ద అల్లుడు, మరో బంధువుతో కలిసి హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న రైలులో ప్రయాణిస్తోంది. దువ్వాడ స్టేషన్లో రైలు ఆగడంతో తాగునీరు పట్టుకునేందుకు ఆమె కిందకు దిగింది. అయితే రైలు కదిలిపోతుండడంతో కంగారుగా రైలు ఎక్కేందుకు ప్రయత్నించి కాలుజారి పడిపోయింది. ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి దువ్వాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆలిండియా వర్సిటీ ఖోఖో టోర్నీకి ఏయూ పురుషుల, మహిళల జట్లు



రిజిస్ట్రార్ ధనుంజయరావుతో జట్టు సభ్యులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్ల సభ్యులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు గురువారం అభినందించారు. పతకాలు సాధించి ఏయూ ఖ్యాతిని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ తిరుపూర్ తమిళనాడు యూనివర్సిటీలో జరిగే ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నీలో పురుషుల జట్టు, కాలికట్ యూనివర్సిటీలో జరిగే ఖోఖో టోర్నీలో మహిళల జట్టు పాల్గొంటుందని వివరించారు. పురుషుల జట్టుకు కోచ్‌గా ప్రభుత్వ డిగ్రీ కాలేజి (చింతపల్లి) ఫిజికల్ డైరెక్టర్ శివకుమార్, మహిళల జట్టు కోచ్‌గా సెయింట్ యాన్స్ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ ఎ.సంధ్యారాణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.



టోర్నీకి ఎంపికైన మహిళల జట్టు సభ్యులతో మాట్లాడుతున్న ఏయూ అధికారులు

వేంకటేశ్వర స్వామి ఉదయాస్తమాన సేవలు ప్రారంభం



ప్రసంగిస్తున్న ఆకెళ్ల విభీషణ శర్మ

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మానవాళిని ఉద్ధరించడానికి వైకుంఠం నుంచి భూలోకానికి దిగివచ్చిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి అని బ్రహ్మశ్రీ ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు డీఆర్‌డీఏ సమీపంలోని ఎంవీ భద్రం కమ్యూనిటీ హాలులో రుషిపీఠం ఆధ్వర్యంలో గురువారం శ్రీవేంకటేశ్వర ఉదయాస్తమాన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ నెల 29 వరకూ నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రవచననిధి శర్మ మొదటి రోజున వేంకటేశ్వర వైభవంపై ప్రసంగించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతంతో ప్రారంభమై అర్చన, తోమాల సేవ, కల్యాణం, తిరువీధోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి 8 గంటలకు పవళింపు సేవలను భక్తులు ప్రత్యక్షంగా వీక్షించారు. తిరుమల నియమాల మాదిరిగానే సాంప్రదాయ వస్త్రధారణతో భక్తులు పాల్గొన్నారు. శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ శ్రీ వేంకటేశ్వరస్వామి శోభాయాత్రలో కళాకారుల వివిధ వేషధారణలతో, శ్రీవారి సేవకులు, భక్తులతో గోవిందనామ పారాయణంతో పరిసరాలు మార్మోగాయి.

ప్రతి రోజూ ఆకెళ్ల విభీషణ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు, అన్నమయ్య సంకీర్తనలు, నాదనీరాజనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని రుషిపీఠం ప్రతినిధులు కేవీఎస్ శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి శ్రీనివాస్, వివి ఆదినారాయణ తెలిపారు.



శ్రీహరి వేషధారణలో కళాకారులు, భక్తులు

మోహనరంగా విగ్రహావిష్కరణ



వంటవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తూర్పు, దక్షిణం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ

ఆరిలోవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ అన్నారు. వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం 13వ వార్డులో గల ఆఖరి బస్టాప్ సమీపంలో ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యేలు రంగా కాపు సామాజిక వర్గానికే కాకుండా అన్ని వర్గాల గుండెల్లో స్థానం సంపాదించగలిగారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఉత్తరాంధ్ర కాపు నాయకులు అంతా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు పలువురు కాపు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు పి.ధర్మారావు, తెలుగుమహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, పార్లమెంటరీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావుతో పాటు అధిక సంఖ్యలో 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేవీ విన్యాసాలకు ఏర్పాట్లు



ఆర్కే బీచ్‌లో నేవీ కార్యక్రమానికి వేదిక సిద్ధం చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నాలుగో తేదీన ఆర్కే బీచ్‌లో తూర్పు నౌకాదళం నిర్వహించనున్న సాహస విన్యాసాల ప్రదర్శనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అతిథులు, ఆహ్వానితులు కూర్చోవడానికి వీలుగా బీచ్‌లో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానుండడంతో అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నేవీ అధికారులు ఈ నెల 28, 29 తేదీల్లో సాహస విన్యాసాల ప్రదర్శనకు రిహార్సల్స్ నిర్వహించనున్నారు.

సీపీఎం మహాసభలు విజయవంత చేయాలి

ఆరిలోవ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత డెయిరీ ఫారం కూడలి వద్ద మొదలైన ర్యాలీ ఆదర్శనగర్, రవీంద్రనగర్, సుందరనగర్, బాలాజీ నగర్, ఆరిలోవ టీబీసీ పాయింట్, పోలీసు స్టేషన్ మీదుగా ఆరిలోవ ఆఖరి బస్టాప్ వరకు సాగింది. ఈ సందర్భంగా సీపీఐ విశాఖ జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం పోరాటాలు చేయడంలో సీపీఎం ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నేతలు పి.శంకరరావు, డి.నాగరాజు, లక్ష్మీనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

అనాథకు ఆశ్రమం కల్పించిన పోలీసులు



వృద్ధుడిని రెడ్‌క్రాస్ హోంకు తరలిస్తున్న పోలీసులు

మద్దిలపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నా అనే వారు లేక నగరంలో సంచరిస్తున్న వృద్ధుడిని గురువారం త్రీటౌన్ పోలీసులు ఆశ్రయం కల్పించారు. బిహార్‌కు చెందిన దయానంద్ సాహు తన పిల్లలతో గొడవపడి మూడేళ్ల కిందట నగరానికి వచ్చాడు. అప్పటి నుంచి రోడ్డు మీదా బిక్షమెత్తుకుంటూ బతుకుతున్నాడు. గురువారం సిరిపురం ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద చలిలో ఉండడం చూసిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి త్రీటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. వృద్ధుడి వివరాలు తీసుకుని సంబంధిత కుటుంబసభ్యులకు అప్పగించాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో త్రీటౌన్ ఇన్‌చార్జ్ సీఐ తిరుమలరావు, ఎస్ఐ శ్రీనివాస్ సిరిపురం వెళ్లి వృద్ధుడి వివరాలు ఆరా తీశారు. బిహార్‌లో తన కుమారులున్నారని తెలుసుకుని వారు నివాసముంటున్న పరిధి పోలీసులకు సమాచారం అందించారు. కుమారులు వచ్చేవరకు వృద్ధుడిని రెడ్‌క్రాస్ హోంకు తరలించారు.

జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీకి ప్రత్యేక రెఫరీగా శివగిరి



అక్కయ్యపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఈషా ఫౌండేషన్ కోయంబత్తూర్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ప్రత్యేక రెఫరీగా నగరానికి చెందిన జాతీయ స్థాయి కోచ్ వనమూడి శివగిరికి ఆహ్వానం పలికింది. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు శివగిరిని అభినందించారు. ఆయన తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో వాలీబాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు. తాటిచెట్లపాలెం, రైల్వే క్వార్టర్స్, తాటిచెట్లపాలెం బజారు, రైల్వే ఆక్వా స్పోర్ట్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. అందుకోసం వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

వీర్ బాల్ దివస్ పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సీతమ్మధార, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : గురుద్వార్ మందిరంలో గురువారం వీర బాల్ దివస్ పుస్తకాన్ని ఎమ్మెల్యే పి.వి ష్ణుకుమార్ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురుద్వార్ అధ్యక్షుడు ఆనంద్ సింగ్ మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే దేశం, ధర్మం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమై సజీవ సమాధి అయిన సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ మహారాజు వీర పుత్రులు ఫతే సింగ్, జోరావర్ సింగ్ త్యాగాలు గుర్తుగా జరుపుకునే వీర బాల్ దివస్‌ను జరుపుకుంటునమన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ వీర బాల్ దివస్ సందర్భంగా వారి త్యాగాలను, సాహసాన్ని పరాక్రమాన్ని స్మరించుకుందామన్నారు. కార్యక్రమంలో శ్యామల తదితరులు పాల్గొన్నారు.



రమణకు శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు

కేజీహెచ్ ఏఓగా రమణ

మహారాణిపేట,డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్ పరిపాలనాధికారిగా బీవీ రమణ గురువారం బాధ్యతలు స్వీకరించారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులకు పరిపాలన అధికారులుగా డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన వారిని నియమించింది, ఈమేరకు కేజీహెచ్‌కు ఏఓగా డిప్యూటీ కలెక్టర్ రమణ నియమితులయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఆర్ఎంఓలు డా.ధవళ బాస్కర్, డా మెహర్‌కుమార్, మెడికల్ కాలేజీ ఏడీ లోకనాథన్, మేనేజర్ జవహర్, తదితరులు నూతన ఏఓను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

32వ వార్డులో అధికారుల పర్యటన

అల్లిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 32వ వార్డులోని కృష్ణా గార్డెన్స్, భీమ్ నగర్, అల్లిపురం ప్రాంతాల్లో జోనల్ అధికారులు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలువలు, తాగునీటి సమస్యపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో జడ్సీ ఎం. మల్లయ్యనాయుడు, కార్పొరేటర్ కందుల నాగరాజు, సీఈ శివప్రసాద్ రాజు, ఎస్ఈ రవి, ఈఈ మురళీకృష్ణ, డీఈ సతీశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మహారాణిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని క్యాజువాలిటీ విభాగం అభివృద్ధి పనులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ గురువారం శంకుస్థాపన చేశారు. పోర్టు ట్రస్టు క్యాజువాలిటీ విభాగం అభివృద్ధికి రూ. కోటి కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నిధులతో పలు పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఏడి అప్పారావు, మేనేజర్ జవహర్, చీఫ్ డైటీషియన్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

అల్లిపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వందేళ్ల సీపీఐ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయం వద్ద ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, అత్తిలి విమల, ఎం. మన్మధరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జోనల్ కమిషనర్ రాము



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేశ్, జెడ్సీ రాము

మద్దిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని టీడీపీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం 53వ వార్డు మద్దిపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తుందన్నారు.అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొందరు 22ఏ జాబితాలో ఉన్న తమ ఇళ్ల స్థలాలను జాబితా నుంచి తొలగించాలని కోరగా, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని మరి కొందరు వినతులు అందించారు. కాగా ఉదయం 9 గంటలకు సదస్సు జరగాల్సి ఉండగా అధికారులు 11 గంటల వరకు హాజరు కాలేదు. దీంతో స్థానికులు సుమారు రెండు గంటల పాటు వారి కోసం పడిగాపులు కాశారు. సదస్సులో ప్రజలు 171 వినతులు అందించినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, జోన్-5 జడ్సీ బి. రాము, ఆర్ఐ కె. కోమలి, డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాయి, సర్వేయర్ రాజగోపాల్, జనసేన 53వ వార్డు అధ్యక్షుడు నీరుకొండ దివాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు కాళ్ల ఆదిబాబు, నాయకులు శ్యామల దీపిక, మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి, 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ



రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్యామలాదీపిక, బాలాజీ, సునీల్ తదితరులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహన్ రంగా 36వ వర్ధంతి సందర్భంగా రాధా రంగా రాయల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో 44వ వార్డులోని అక్కయ్యపాలెం పార్కులో గురువారం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ ఉత్తర నియోజవర్గం నాయకులు శ్యామలాదీపిక, సునీల్, టీడీపీ నాయకుడు మౌర్యసింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధా రంగ రాయల్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె బాలాజీ మాట్లాడుతూ మోహన్ రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం విశాఖలో చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు, నేతలు ఉషశ్రీ, శ్రీవాణి, బీశెట్టి వరలక్ష్మి, టి.శ్రీనివాసరావు, గోవింద్, శివ, గుడివాడ ప్రభాకర్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడిన ప్రాంతాల్లో 28 నుంచి రెవెన్యూ సదస్సు

సీతమ్మధార, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : కొన్ని ప్రాంతాల్లో వాయిదా పడిన రెవెన్యూ సదస్సులను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్టు సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.రమేశ్ తెలిపారు. భూ సంబంధిత సమస్యలు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నెల 28వ తేదీన 15, 16, 23 వార్డుల ప్రజలు మద్దిలపాలెంలోని కృష్ణా కాలేజీ ఎదురుగా గల సచివాలయం, 30న పెదవాల్తేరు, చినవాల్తేరుకు సంబంధించి 17, 18, 19, 20, 21, 22 వార్డుల ప్రజలు పెదవాల్తేరు గాంధీబొమ్మ వద్ద గల సచివాలయం సెంటర్, జనవరి 3న అల్లిపురం ఎక్స్‌టెన్షన్ వార్డుకి సంబంధించి 14, 25, 26, 42, 43, 44 వార్డుల ప్రజలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ వెనుక ప్రాంతంలో గల సింధూర గెస్ట్ హౌస్‌లో సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు.

ఆలిండియా వర్సిటీ ఖోఖో టోర్నీకి ఏయూ పురుషుల, మహిళల జట్లు



రిజిస్ట్రార్ ధనుంజయరావుతో జట్టు సభ్యులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల, మహిళల ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్ల సభ్యులను ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు గురువారం అభినందించారు. పతకాలు సాధించి ఏయూ ఖ్యాతిని నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ తిరుపూర్ తమిళనాడు యూనివర్సిటీలో జరిగే ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నీలో పురుషుల జట్టు, కాలికట్ యూనివర్సిటీలో జరిగే ఖోఖో టోర్నీలో మహిళల జట్టు పాల్గొంటుందని వివరించారు. పురుషుల జట్టుకు కోచ్‌గా ప్రభుత్వ డిగ్రీ కాలేజి (చింతపల్లి) ఫిజికల్ డైరక్టర్ శివకుమార్, మహిళల జట్టు కోచ్‌గా సెయింట్ యాన్స్ కాలేజి ఫిజికల్ డైరక్టర్ ఎ.సంధ్యారాణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

యువతుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

అక్కయ్యపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలో స్పిన్నింగ్ మిల్స్‌లో ఉపాధి అని చెప్పి యుక్త వయసులో ఉన్న సైత భత్ర, సుభద్ర పరజా అనే ఇద్దరు ఆడపిల్లలను అక్రమ రవాణా చేస్తున్నారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆరోపించారు. వారం రోజుల క్రితం విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్, ఏయూటీడీ వల్ల ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిందన్నారు. ఆ ఇద్దరికి టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించామన్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

కనకమ్మ అలంకరణలో కన్యకాపరమేశ్వరి





కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు, కనకమహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

మహారాణిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వన్ టౌన్‌లోని వాసవీ కన్యకాపర మేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగు తున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా నాలుగో గురువారం అమ్మవారిని కనక మహాలక్ష్మి అమ్మవారి రూపంలో అలంకరిం చారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున ప్రత్యేక పూజలు అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. తరువాత 250 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రపారా యణం చేశారు. మధ్యాహ్నం వెయ్యి మందికి అన్న సమారాధన నిర్వహిం చారు. ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు,

సచివాలయ సిబ్బందితో సమావేశం



మాట్లాడుతున్న జడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ కూడలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఉన్న షెడ్యూల్ కులాల జాబితాపై అభ్యంతరాలను తెలియజేయాలని జోన్ 4 కమిషనర్ మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం ఆయన జోన్ 4 కార్యాలయంలో తహసీల్దార్ జిలానీతో కలిసి వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఉంటున్న షెడ్యూల్ కులాలకు చెందిన నివాసితుల జాబితాను ఇప్పటికే రెవెన్యూ అధికారులు విడుదల చేశారని తెలిపారు. వాటిలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. తహసీల్దార్ జిలానీ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మహారాణిపేట రెవెన్యూ పరిధిలో షెడ్యూల్ కులాలకు నివాసితుల జాబితాను విడుదల చేసినట్టు చెప్పారు. జాబితా అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. షెడ్యూల్ కులాలకు చెందిన కుటుంబీకుల పేర్లు జాబితాలో నమోదు కాకపోయినా, ఆక్షేపణలు ఉన్నా.. ఈనెల 31వ తేదీలోగా వీఆర్‌ఓకు తెలియజేయాలన్నారు. వచ్చే నెల 10న తుది జాబితాను ప్రకటిస్తామని చెప్పారు.

కులగణన పారదర్శకంగా చేపట్టాలి : జేసీ

మహారాణిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కులగణనపై గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జరిగే సామాజిక సర్వేను పారదర్శకంగా చేపట్టాలని జేసీ అశోక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

స్టీల్‌ప్లాంటును ఆదుకోవాలి

సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు



జగదాంబ జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

జగదాంబ కూడలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోదీతో చర్చలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడడాన్ని సీపీఎం నాయకులు తప్పుబట్టారు. గురువారం వారు సీఎం వైఖరిని నిరసిస్తూ జగదాంబ జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు అందించేలా చూస్తామన్న కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని విమర్శించారు. చంద్రబాబు, మోదీ మధ్య జరిగిన చర్చలో స్టీల్ ప్లాంట్ కోసం కాకుండా మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మోదీతో జరిపిన చర్చల వివరాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను పక్కపెట్టి మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ప్రభుత్వం తహతహలాడడం వెనుక మర్మమేమిటని నిలదీశారు. కార్యక్రమంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, జగన్, సుబ్బారావు, పి. మణి, చలపతి, నాయుడు పాల్గొన్నారు.

మెకానికల్ మాయాజాలం

... 5వ పేజీ తరువాయి

సదరు కాంట్రాక్టర్ బిల్లు నుంచి జీవీఎంసీ మినహాయించి కొత్త కాంట్రాక్టర్‌కు అందజేయాల్సి ఉంటుంది. అయితే మెకానికల్ విభాగం అధికారులు వాహనాల నిర్వహణ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) టెండర్లు పిలిచినప్పుడు ఆ విషయాన్ని సరిగా పట్టించుకోకపోవడంతో ఎనిమిదేళ్ల కిందట కొనుగోలు చేసిన 14 సీఎంటీ కాంపాక్టర్ వాహనాలు మూలకు చేరిపోయాయి. ఆయా వాహనాల జీవితకాలం మరో రెండేళ్లు మాత్రమే ఉన్నప్పటికీ అధికారులు మాత్రం వాటికి రిపేరు చేయించి తిరిగి రోడ్డుపై తిప్పాలని నిర్ణయించారు.

రూ.17 లక్షలతో మరమ్మతు చేయిస్తే...

14 సీఎంటీ కాంపాక్టర్లు పదిహేను కూడా మరమ్మతులకు గురవడంతో అధికారులు రిపేర్లకు టెండర్లు పిలిచారు. ఒక్కో వాహనానికి రూ.17 లక్షల ఖర్చుతో రిపేర్లు చేసేలా నలుగురు కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకున్నారు. వీటిలో ఏడు వాహనాలు మరమ్మతులు పూర్తిచేసుకుని రెండు నెలల కిందట జీవీఎంసీకి చేరాయి. వీటి నిర్వహణకు కొత్తగా టెండర్లు పిలవడంతో వేర్వేరు వ్యక్తులు టెండర్ దక్కించుకున్నారు. అయితే రూ.17 లక్షలు ఖర్చుపెట్టిన వాహనాల ఇంజన్‌లు మొరాయిస్తుండడంతో వాటి నిర్వహణ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు రిపేర్లు చేయించుకుంటున్నారు. అయితే ఒక వాహనం ఇంజన్ బాగా దెబ్బతినడంతో దానికి రూ.నాలుగు లక్షలకు పైగా ఖర్చు అవుతుందని మెకానిక్ అంచనా వేయడంతో సదరు కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో మెకానికల్ అధికారులే ఆ వాహనాన్ని జ్ఞానాపురంలోని ఒక ప్రైవేటు గ్యారేజీకి పంపించి రిపేరు చేయించే బాధ్యతను తీసుకున్నారు. కొత్తవాహనం ఖరీదు సుమారు రూ.50 లక్షలు ఉంటుందని, మూలకు చేరిన వాహనానికి రూ.20 లక్షలు వెచ్చించి రిపేరు చేసినా మరో రెండేళ్లకు మించి తిరగదని తెలిసి కూడా అధికారులు రూ.కోట్లు ఖర్చుపెట్టడం ఏమిటని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీవీ వామనరావు ప్రశ్నించారు. రిపేర్లకు ఖర్చుపెట్టే డబ్బుకి మరో రూ.30 లక్షలు ఖర్చుపెడితే కొత్తవాహనం వచ్చేస్తుందని, కొత్తవాహనానికి కనీసం ఐదేళ్లు రిపేర్లు లేకుండా పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. దీనివల్ల చెత్తసేకరణ, తరలింపులో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా పనిచేయవచ్చునన్నారు.

మెకానికల్ టెక్నికల్ అడ్వైజర్ ఏం చేస్తున్నారో మరి :

జీవీఎంసీ మెకానికల్ విభాగంలో వాహనాల రిపేర్లలో అక్రమాలకు చోటులేకుండా పారదర్శకంగా అంచనాలు తయారుచేసేందుకు వీలుగా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ఒకరిని టెక్నికల్ అడ్వయిజర్‌గా నియమించారు. సుమారు రూ.50 వేలు గౌరవ వేతనంతోపాటు ఒక కారు, డ్రైవర్, నెలకు 200 లీటర్లు ఇంధనం జీవీఎంసీ ఇస్తోంది. ఎనిమిదేళ్ల జీవితకాలం పూర్తయిన 15 వాహనాలను దాదాపు రూ.17 లక్షలు చొప్పున ఖర్చు పెట్టి మరమ్మతు చేయించాలని సదరు అడ్వయిజర్ సూచించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పైగా ఆ వాహనాల రిపేర్లు కూడా విజయవాడలో తనకు తెలిసిన వ్యక్తి గ్యారేజీలోనే చేయించాలని షరతు పెట్టినట్టు సమాచారం.



ఆర్‌కే బీచ్‌లో నేవీ కార్యక్రమానికి సిద్ధం చేస్తున్న వేదిక

నేవీ విన్యాసాలకు ఏర్పాట్లు

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నాలుగో తేదీన ఆర్‌కే బీచ్‌లో తూర్పు నౌకాదళం నిర్వహించనున్న సాహస విన్యాసాల ప్రదర్శనకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. అతిథులు, ఆహ్వానితులు కూర్చోవడానికి వీలుగా బీచ్‌లో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరు కానుండడంతో అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నేవీ అధికారులు ఈ నెల 28, 29 తేదీల్లో సాహస విన్యాసాల ప్రదర్శనకు రిహార్సల్స్ నిర్వహించనున్నారు.

న్యూ ఇయర్ వేడుకల నిర్వహణకు అనుమతి తప్పనిసరి

... 5వ పేజీ తరువాయి

దిగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకల పేరుతో అశ్లీలనృత్యాలు ప్రదర్శించడం, బాణసంచా కాల్చడం, మితిమీరిన శబ్దం వచ్చేలా సౌండ్ సిస్టమ్ ఏర్పాటుచేయడం చేస్తే కేసులు నమోదు చేస్తామనిసీపీ హెచ్చరించారు.

న్యూఇయర్ పేరుతో హద్దుమీరితే కేసులే

కొత్త సంవత్సరం వేడుకల పేరుతో ఎవరైనా హద్దుమీరి ప్రవర్తిస్తే కేసులు నమోదుచేస్తామని సీపీ హెచ్చరించారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి ఎనిమిది నుంచి జనవరి ఒకటో తేదీ ఉదయం ఐదు గంటల వరకూ తెలుగుతల్లి ఫ్లైఓవర్ తోపాటు జీవీఎంసీ అండర్‌పాస్ రోడ్డును మూసివేస్తామన్నారు. అలాగే మద్దిలపాలెం నుంచి రామాటాకీస్, హనుమంతవాక నుంచి ఎన్ఏడీ జంక్షన్, గోశాల జంక్షన్ నుంచి వేపగుంట జంక్షన్ వరకూ బీఆర్‌టీఎస్ రోడ్లు మూసివేస్తామన్నారు. అత్యవసరమైనవారు రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్డులో వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఆకతాయిలకు చెక్ చెప్పేందుకు నోవాటెల్ జంక్షన్, ఆర్కే బీచ్, భీమిలి, గాజువాక, పెందుర్తి పరిసరాల్లో షీటీమ్స్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. బీచ్‌రోడ్డులో జనాలను 12 గంటల తరువాత బయటకు పంపించేస్తామని, అక్కడ బాణసంచా కాల్చేవారిని, శుభాకాంక్షలు చెప్పే పేరుతో ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించేవారిని గుర్తించడం కోసం డ్రోన్లతో నిఘా పెడుతున్నామన్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లతో వాహనాలను నడపడం, అపరిమిత వేగంగా వాహనాలను నడపడం వంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎక్కడికక్కడ పోలీస్ బీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే వాహనం సీజ్ చేయడంతోపాటు కోర్టులో హాజరుపరచడం, లైసెన్స్‌ను మూడు నెలలు రద్దు చేయడం జరుగుతుందని సీపీ హెచ్చరించారు. ప్రజలంతా సురక్షితంగా ఉండే మార్గంలో వేడుకలు జరుపుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు చెక్

... 5వ పేజీ తరువాయి

చెప్పేవారు కాదు. అలా అప్పట్లో వీఎంఆర్‌డీఏ వద్ద కొనుక్కొని ఇప్పుడు ఎవరైనా వాటిని తిరిగి అమ్మాలనుకుంటే...అవి కూడా 22-ఏలో కనిపిస్తున్నాయి. వాటికి కూడా జిల్లా రిజిస్ట్రార్ అనుమతి అవసరం అని చూపిస్తోంది. అదేవిధంగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములు కూడా 22-ఏలో ఉన్నాయి. ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి వాటిని తిరిగి కొనుక్కున్న వారికి కూడా ఇప్పుడు రిజిస్ట్రేషన్లు జరగడం లేదు.

అయితే గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేదలకు 'సెంటు భూమి' ఇచ్చింది. వారి ఆర్థిక అవసరాలకు ఆ భూమిని ఎప్పుడైనా అమ్ముకునే వెసులుబాటు కల్పించింది. దానిని ఆసరాగా చేసుకొని వైసీపీ నేతలు చాలామంది లబ్ధిదారుల పేరిట రిజిస్టర్ అయిన భూములను నెల రోజులకే, కొందరైతే మరుసటిరోజే తమ బినామీల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిపై ఆరా తీస్తుండడంతో వాటిని ఏదో ఒక రేటుకు అమ్మేసి బయటపడాలని యత్నిస్తున్నారు. ఇలాంటి తప్పుడు రిజిస్ట్రేషన్లు ఆపడానికే ప్రభుత్వం 'జిల్లా రిజిస్ట్రార్ అనుమతి' అవసరం అనే నిబంధన విధించింది. జగనన్న కాలనీలు కూడా 22-ఏలోనే ఉన్నాయి. వాటిని పరిశీలించి, నిజమైన లబ్ధిదారులు అమ్ముతున్నారా?,బినామీలు అమ్ముతున్నారా?...అనేది పరిశీలించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ క్రమంలో ప్రభుత్వ సంస్థల నుంచి భారీగా డబ్బులు పెట్టి ప్లాట్లు కొన్నవారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై వెంటనే అధికారులు మార్గదర్శకాలుజారీచేయాల్సి ఉంది.

విమ్స్‌లో బ్లడ్ బ్యాంక్

... 5వ పేజీ తరువాయి

స్థాయి కమిటీ బ్లడ్ బ్యాంకు అవసరాన్ని గుర్తించడంతోపాటు వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేంద్రస్థాయిలో అనుమతులకు ఔషధ నియంత్రణ మండలి విభాగానికి సమాచారం పంపించింది. కొద్దిరోజుల్లోనే అనుమతులు వస్తాయని భావిస్తున్నారు.

పనులు పూర్తి..

బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు విమ్స్ మొదటి అంతస్థులో సుమారు ఏడు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. దీంతో రక్త శుద్ధి, నిల్వ, పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేశారు.

రోగులకు మేలు

- డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్

విమ్స్‌లో బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జిల్లా ఔషధ నియంత్రణ మండలితోపాటు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ప్రాథమిక అనుమతులు ఇచ్చాయి. కేంద్రం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే సేవలను ప్రారంభిస్తాం. విమ్స్‌లో ప్రతి రోజూ 30 వరకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. వీరిలో కనీసం ఐదుగురికి రక్తం అవసరం అవుతుంది. హెల్త్ సిటీలోని ఇతర ఆస్పత్రులకు కూడా విమ్స్‌లో ఏర్పాటయ్యే బ్లడ్ బ్యాంకు ఉపయోగపడుతుంది. రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కీలకంగా మారుతుంది.

గ్రీన్ బెల్టును రాసిచ్చేశారు!

... 5వ పేజీ తరువాయి

కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆరోజు సాయంత్రమే జీవీఎంసీ సిబ్బంది వెళ్లి గ్రీన్ బెల్ట్‌లో కొన్ని నిర్మాణాలను నామమాత్రంగా తొలగించారు. అయితే యాజమాన్యం తమకు అనుమతులు ఉన్నాయంటూ కొన్ని పత్రాలు చూపించింది. దాంతో వారు వెనక్కి తగ్గారు.

ఆశ్చర్యపోయే వాస్తవాలు

● హైవే సర్వీస్ రోడ్డు నుంచి షాపింగ్ మాల్‌లోకి రాకపోకలు సాగించడానికి గ్రీన్ బెల్ట్ మధ్య నుంచి మార్గం వేసుకోవడానికి భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ)ను యాజమాన్యం అనుమతి కోరింది. వెళ్లడానికి రెండు మార్గాలు, రావడానికి రెండు మార్గాలు కావాలని విజయవాడ అధికారులకు లేఖ రాసింది. ఆగమేఘాలపై అనుమతి ఇచ్చారు. ఒక్కో మార్గం 40 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవుతో వేసుకోవచ్చునని సూచించారు. దీనికి కేవలం రూ.2 లక్షలు రుసుము కట్టించుకున్నారు. కొన్ని నిబంధనలు విధించారు. గ్రీన్ బెల్ట్ తొలగించడానికి అవసరమైన అనుమతులు అటవీ శాఖ నుంచి తీసుకోవాలని చెప్పారు. రాకపోకలకు ఉపయోగించుకునే భూమి ఎవరిదైతే వారితో యాజమాన్య వివాదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అంటే ఆ భూమి తమది కాదని పరోక్షంగా సూచించారు. గ్రీన్ బెల్ట్ నిర్వహిస్తున్న జీవీఎంసీదే అని పరోక్షంగా చెప్పారు.

ఎంత భూమి ఇచ్చారంటే...?

ఒక్కో రోడ్డు 40 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవు. ఇలాంటివి నాలుగు రోడ్లు. వెళ్లడానికి రెండు, తిరిగి రావడానికి రెండు. ఈ రహదారుల విస్తీర్ణం 160 అడుగుల వెడల్పు, 70 అడుగుల పొడవు. అంటే 11,200 చదరపు అడుగులు. ఇది 1,244 చదరపు అడుగులకు సమానం. అక్కడ చదరపు అడుగు భూమి విలువ రూ.1.5 లక్షలు ఉంది. అంటే ఈ భూమి విలువ రూ.18.66 కోట్లు. అంత విలువైన భూమిని ఉపయోగించుకుంటున్నప్పుడు దానికి లీజు మొత్తం జీవీఎంసీకి ఏడాదికి ఓసారి కట్టాలి. ముందుగా అడ్వాన్స్ కొంత చెల్లించాలి. కానీ దీనిపై ఇరువర్గాల మధ్య ఎటువంటి ఒప్పందం లేదు. ఉదారంగా ఇచ్చేశారు.

గ్రీన్‌బెల్ట్ మళ్లీ అభివృద్ధి చేయాలి..కానీ ఎలా..?

ఈ మాల్ వ్యవహారంలో జీవీఎంసీ కూడా గ్రీన్ బెల్ట్ తొలగింపునకు అనుమతి ఇచ్చింది. అయితే ఎన్ని చెట్లు, మొక్కలు తొలగిస్తే వాటికి ఐదు రెట్లు మళ్లీ వేయాలని నిబంధన పెట్టింది. అదే స్థలంలో మళ్లీ గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేయాలని, దానికి రూ.43.3 లక్షలు వ్యయం అవుతుందని పేర్కొంది. అయితే నాలుగు రహదారుల నిర్మాణానికి అవసరమైన మేరకు గ్రీన్ బెల్ట్ తొలగించాలి. కానీ యాజమాన్యం మొత్తం తొలగించేసింది. మళ్లీ అక్కడ గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడానికి వీల్లేకుండా సిమెంట్ ప్లాట్‌ఫారం నిర్మించేసింది. అనుమతించిన ఏరియాను మార్గం కోసమే వినియోగించాలని నిర్మాణాలకు, పార్కింగ్‌కు ఉపయోగించకూడదని జీవీఎంసీ నిబంధన పెట్టింది. కానీ అక్కడ పార్కింగ్‌కు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. రహదారుల ఏరియాలో నీరు పోవడానికి వీలుగా కాలువ ఉండాలని, దానికి మ్యాన్‌హోళ్లు ఉండాలని చెబితే... జీవీఎంసీకి చెందిన స్థలంలోనే కాలువ నిర్మించడం విశేషం.

ఏమి ముట్టాయో తెలియదు?

ఈ వ్యవహారంలో ఎన్‌హెచ్ఏఐ, జీవీఎంసీ అధికారులకు ఏం ముట్టాయో తెలియదు కానీ అడ్డగోలుగా సహకరిస్తున్నారు. గ్రీన్‌బెల్ట్ మధ్య నుంచి రోడ్లు అని చెప్పి మొత్తం మొక్కలు, చెట్లు తీసేశారు. దీనికి ఎవరి నుంచీ అనుమతులు తీసుకోలేదు. కోట్ల రూపాయల ప్రభుత్వ స్థలాన్ని ఉదారంగా వాడుకోవడానికి ఇచ్చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా ఒకరిపై మరొకరు నెపం నెట్టుకుంటున్నారు తప్పితే తప్పులను సవరించే ప్రయత్నం చేయడం లేదు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఊరుకోబోమంటూ పత్రికా ప్రకటనలు గుప్పించే అధికారులు, నేతలూ నోళ్లు మెదపడం లేదు. ఎందుకో మరి.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి

వైభవంగా ముగిసిన అయ్యప్ప మండల పూజ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అయ్యప్పస్వామి వారి ఆలయంలో మండల పూజ ముగింపు ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. శబరిమల సన్నిధానంలో నిర్వహించే విధంగానే ఇక్కడి ఆలయంలో కూడా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పుష్పాభిషేకం, బలిహరన, ధ్వజ అవరోహణ పూజ, గుడిసేవ, మహాహరతి కార్యక్రమాలను ఆలయ అర్చకులు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూజలు అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే...

గోపాలపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్-3 కార్యనిర్వాహక ఇంజనీరు పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సుసర్ల కాలనీ, సీతారామరాజు నగర్, ఎన్ఏడీ ఎస్సీ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, గాంధీనగర్, రెడ్డి వీధి, గవర వీధి, జయప్రకాష్‌నగర్, తుంపాల వీధి, ఎల్లపువానిపాలెం, సంతోషినగర్, కార్వేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మీనగర్‌లో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కుంకుమ పూజలు, పాలాభిషేకాలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

హిందీ అమలుకు కృషి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం టౌన్ అధికార భాషా అమలు కమిటీ (టోలిక్) ఇన్ పబ్లిక్ సెక్టార్ 16వ సమావేశం గురువారం స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ భవనంలో నిర్వహించారు. సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ ఏకే సక్సేనా మాట్లాడుతూ హిందీ అమల్లో ప్రభుత్వ రంగ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దక్షిణ ప్రాంతీయ స్థాయిలో 2023-24కి విశాఖను ఉత్తమ టోలిక్‌గా ఎంపికచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్ (పర్సనల్) సురేష్ చంద్రపాండే, హెచ్‌పీసీఎల్ సీజీఎం జి.కిరణ్‌కుమార్, టోలిక్ డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిస్వాస్, స్టీల్‌ప్లాంట్ జీఎం లలన్‌కుమార్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యువి:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 22, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 42, బీరకాయలు 56, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 24, క్యారెట్ 42 దొండకాయలు 48, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది)56, మునక్కాడలు (కిలో) 140, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 56, పొటల్స్ 60, కీరదోస 38, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 60, దేముడుచిక్కుడు 44, కొండటసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, కర్రపెండలం 28, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 40, మామిడి అల్లం 64, జామకాయలు(కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	125
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220





పినగాడిలో నీటిలో తడిసిన వరి పైరు... పక్కన తడిసిన వరి పైరుకు మొక్కలు వచ్చిన దృశ్యం

రైతన్నకు తీరని న(క)ష్టం

వర్షాలు కొంపముంచాయని కర్షకుల ఆవేదన



సరిపల్లిలో ఒరిగిన వరి వెన్ను

పెందుర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల వ్యవధిలో రెండు అల్పపీడన ప్రభావాలతో కురిసిన వర్షాలు మండలంలోని రైతాంగానికి కడగండ్లు మిగిల్చాయి. తొలుత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నీటి కోసం అల్లాడిన రైతులకు.. ఆ తర్వాత తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు కుంగదీశాయి. వానలు కురవనప్పుడు సాగునీరు లేక ప్రత్యామ్నాయ పద్ధతిలో మోటారు, బోర్లతో వరి పంట పొలాలకు నీరందించి నెట్టుకొచ్చారు. తీరా పంట చేతికొస్తుందన్న తరుణంలో వర్షాల దెబ్బకు వరి వెన్ను ఒరిగింది. గత నెలలో కురిసిన వర్షాలు కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. విరామం లేకుండా వానలు కురవడంతో మండలంలో పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరిచేలు నేలకొరగడంతో చేతికందుతున్న పంట దక్కకుండా పోతుందన్న భయాందోళనకు అన్నదాత గురయ్యాడు. ఈ దశలో వర్షాలు తగ్గడంతో రైతుల ఆశలు చిగురించి కోతల పనులు ముమ్మరం చేశారు. దీంతో పలు గ్రామాల్లో వరి కోతలు చేపట్టారు. అయితే మళ్లీ వరుణుడు కన్నెర్ర చేయడంతో రైతుల ఆశలన్నీ ఆవిరయ్యాయి. వర్షాల వల్ల మండలంలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు చేసిన పైరు నీట మునిగింది. లోతట్టు ప్రాంతంలోని పొలాల్లో పైరు నీళ్లలోనే నానుతుంది. కొన్ని ప్రాంతాల్లో కోతలు కోయని వరికంకు వెన్ను ఒరిగి నీటి పాలైంది. వరికుప్పలు పెట్టే సమయంలో కురుసున్న వర్షాలు తమ పాలిట శాపాలుగా మారాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిలో నానిన వరి వెన్ను కంకులకు, కోతలు కోయని వరి పైరుకు మొక్కలు రావడంతో తమకు పంట నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. మండలంలోని పినగాడి, గొరపల్లి, ముదపాక, నరవ, రాజయ్యపేట, సరిపల్లి, ముదపాక, ఎస్ఆర్ పురం, గుర్రమ్మపాలెంలలో వరి పైరు నీటిపాలయ్యింది. సుమారు వంద హెక్టార్లలో వరి పైరు నీట మునగడంతో పంట నష్టం తీవ్రత అధికంగా ఉంది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

జాయింట్ కలెక్టర్ మయూర్ శశాంక్



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ మయూర్ శశాంక్

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలందరూ ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ మయూర్ శశాంక్ కోరారు. 69వ వార్డు పరిధి నాతయ్యపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి ఆక్రమణలు జరిగినా సహించేది లేదని, వాటిని పరిరక్షించేందుకు అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఆ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వమే ఈ సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రమంలో నాతయ్యపాలెం రహదారి ఆక్రమణ, హరిజన జగ్గయ్యపాలెంలోని సర్వే నంబర్-4/1లోని సంత స్థలం కబ్జా, వంటి వాటితో పాటు సుమారు 60 ఫిర్యాదులకు సంబంధించిన అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక తహసీల్దార్ మధుసూదనరావు, తహసీల్దార్ శ్రీవల్లి, స్థానిక నాయకులు అలమండ రాజు, అక్కిరెడ్డి శ్రీను, బి.సన్యాసిరావు, జి.గోపి, జి.వెంకటరమణ, ఎస్.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై స్పందించిన రెవెన్యూ యంత్రాంగం

రెవెన్యూ సదస్సులో జాతీయ రహదారి నుంచి నాతయ్యపాలెం వచ్చే రోడ్డు ఆక్రమణకు గురైందంటూ పలువురు ఫిర్యాదు చేయడంపై రెవెన్యూ యంత్రాంగం తక్షణమే స్పందించింది. రహదారి స్థలాన్ని కొంతమంది ఆక్రమించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లుతున్నట్టు అధికారులకు అందిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీవల్లితో పాటు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, తదితరులు ఈ స్థలాన్ని పరిశీలించారు. ఈ రోడ్డులో తక్షణమే సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలని సిబ్బందికి తహసీల్దార్ శ్రీవల్లి ఆదేశించారు.

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

గాజువాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత డిసెంబరులో సమ్మె చేసిన సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పదవీ విరమణ బెనిఫిట్‌లను ఇవ్వాలని, మృతిచెందిన కార్మిక కుటుంబాలకు ఆర్థిక సహాయం చేయాలని, ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ఉపాధి, ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.అప్పారావు, రాము, నాగరాజు, గణేశ్, నాయుడు, సత్యం, మంగ, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలివ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు తక్షణమే యాజమాన్యం జీతాలు ఇవ్వాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కుంటుపడ్డాయని, ఉక్కు ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని, క్యాంటీన్లను మెరుగుపరచాలన్నారు. స్టీల్‌ప్లాంటుపై కేంద్రం తమ వైఖరిని మార్చుకోలేదని, పార్లమెంట్ సాక్షిగా ప్రైవేటీకరణపై ప్రకటనలు చేస్తే తెలుగు రాష్ట్రాల ఎంపీలు ప్రశ్నించకపోవడం సరికాదన్నారు. వైటీ దాసు, యు.రామస్వామి, కె.గంగాధర్, కృష్ణమూర్తి, మరిడయ్య, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు



స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్లాంట్ అధికారులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుకు ప్రతిష్ఠాత్మకమైన ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు-2024 లభించింది. ఉక్కు కర్మాగారంలో ఇంధన పొదుపు కోసం చేపట్టిన చర్యలకుగాను బంగారు పతకం లభించింది. ఈ మేరకు విజయవాడలో గురువారం జరిగిన ఇంధన పొదుపు వారోత్సవాల్లో రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎనర్జీ) కె.విజయానంద్ చేతుల మీదుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ జీఎం (ఇంధనం, పర్యావరణం) ఉత్తమ్ బ్రహ్మ, డీజీఎం పుల్లారెడ్డిలు అవార్డు అందుకున్నారు. స్టీల్‌ప్లాంటులో మూడేళ్లుగా వ్యర్థ శక్తిని వినియోగించే శక్తి సంరక్షణ చర్యలను అమలు చేసినందుకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఉద్యోగులను స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఏకే సక్సేనా అభినందించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు అభినందనలు



పతకాలు సాధించిన క్రీడాకారులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కోయంబత్తూరులో జరిగిన 62వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉక్కునగరం రింక్ క్రీడాకారులు పతకాలు సాధించారు. బాలుర విభాగంలో పసిడి, బాలికల విభాగంలో నాలుగు సిల్వర్, మిక్సిడ్‌లో ఆరు బ్రాంజ్, సబ్ జూనియర్ విభాగం మిక్సిడ్‌లో ఎనిమిది బ్రాంజ్, సబ్ జూనియర్ ఇన్‌లైన్‌లో మూడు బ్రాంజ్, జూనియర్ బాలికల విభాగంలో ఆరు బ్రాంజ్ పతకాలను సాధించారు. ఈ సందర్భంగా గురువారం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌నాయుడు, కొమ్మినేని శ్రీనివాసరావు అభినందించారు. కోచ్‌లు అమిత్‌గార్గ్, కాశీ, గోపి, తదితరులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెం హైవేపై వంతెన రక్షణ గోడ ధ్వంసమైన దృశ్యం



ధ్వంసమైన శ్రీనగర్ బ్రిడ్జి రక్షణ గోడ

శిథిలమైన రక్షణ గోడలు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

కూర్మన్నపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కూర్మన్నపాలెం కుంచుమాంబ ఆలయం వద్ద ఉన్న బ్రిడ్జి రక్షణ గోడ ధ్వంసమవ్వడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఇక్కడ పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఇక్కడ రక్షణ గోడ ధ్వంసమై ఏళ్ల గడుస్తున్నా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఫార్మాసిటీలోని వివిధ పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, స్టీల్‌ప్లాంట్, వీఎస్ఈజెడ్, ఆటోనగర్‌లోని పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, పరిసర ప్రాంతాల ప్రజలు,దువ్వాడ రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించేవారు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. అయితే రక్షణ గోడ ధ్వంసమవ్వడంతో రాత్రి వేళల్లో ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే భీతిల్లుపోతామని పలువురు వాపోతున్నారు.

శ్రీనగర్-పాత గాజువాక రోడ్డులో..

జాతీయ రహదారి వడ్లపూడి నుంచి శ్రీనగర్, పాత గాజువాక వెళ్లే రహదారిలో రైల్వే బ్రిడ్జిపై ఉన్న రక్షణ గోడ కూడా ధ్వంసమైంది. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు భారీ వాహనాలు బలంగా ఢీకొనడంతో ఒకవైపు రక్షణ గోడ బీటలువారి పడిపోయింది. ఇది జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిసున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించి రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



షీలానగర్ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

వెంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్గశిర బహుళ ఏకాదశిని పురస్కరించుకుని షీలానగర్ ఎస్‌బీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. ముందుగా దివ్యక్షేత్రంలోని శ్రీవారికి పంచామృతాలతో అభిషేకించి, పువ్వులు, తులసీదళాలు, నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 30 కిలోల పులిహోరాను స్వామివారి ముందు ప్రత్యేకవేదికపై శ్రీవారి ఆకృతిలో అమర్చి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు స్వామివారి నిజరూప దర్శనాన్ని కల్పించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే భక్తులు సామూహిక గీతా పారాయణాన్ని పఠించారు.

గ్రీన్ సిటీ ఆలయంలో లక్ష కుంకుమార్చన

ఆటోనగర్: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 88వ వార్డు పరిధి గ్రీన్ సిటీలోని శ్రీదేవి, భూదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీలక్ష్మీదేవికి లక్షకుంకుమార్చన పూజలను ప్రధాన అర్చకులు ఇరగవరపు శ్రీధర్ స్వామి, వాసు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గ్రీన్ సిటీ పురవీధుల్లో శ్రీవారి ఉత్సవమూర్తిని వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ బండి సురేశ్‌కుమార్, పద్మజ, వీవీ కృష్ణారావు, రాజ్యలక్ష్మి, శాంతి, మల్లికార్జున, చిన్న సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రాదిపై ప్రత్యేక పూజలు

పెందుర్తి: వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీవారి మూలవిరాట్‌కు విశేష హారతులిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారు నిజరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు గోదాదేవి అమ్మవారికి కుంకమార్చన చేశారు. అనంతరం తిరుప్పావై పఠించి గోదాదేవి పదో పాశురాన్ని స్వామికి నివేదించారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలతో పాటు కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు కృషి చేస్తున్నది ఒక్క సీపీఎం మాత్రమేనని భెల్ సీఐటీయూ సీనియర్ నాయకుడు సనపల జగన్నాథరావు అన్నారు. భెల్ హెచ్‌పీవీపీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన సీపీఎం జెండాను ఆవిష్కరించగా, ఈ నెల 28 నుంచి పెందుర్తిలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను పలువురు నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీటీపీ ప్రకాశ్, ఉరుకూటి బాబూరావు, వి.ఆనందరావు, కె.నారపరెడ్డి, సీతంనాయుడు, కె.కిరీటం, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం'



టీడీపీ సభ్యత్వం అందిస్తున్న నల్లారి

కూర్మన్నపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లారు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు పరిధి రాజీవ్ నగర్, చినయాతపాలెంలలో గురువారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచిన వైసీపీ ఇప్పుడు ధర్నాలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. పార్టీ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నేతలు నాగార్జున, నూక అప్పారావు, లోవరాజు, వెంకట అప్పారావు, కండిపల్లి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వసంతాల వేడుకలు



పెదగంట్యాడలో సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించిన స్టాలిన్

పెదగంట్యాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వసంతాల వేడుకను పురస్కరించుకుని గురువారం ఇక్కడి పోతిన సన్యాసిరావు భవనంలో జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, పి.దుర్గారావు, యెల్లేటి శ్రీనివాస్, జి.ఆనంద్, పోతన్న, పోలయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: సీపీఐ శత వార్షికోత్సవాన్ని గురువారం మల్కాపురం గ్రామ మండలి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గుడాల రాంబాబు, టి.కామేశ్వరరావు, ఎన్‌వీ త్రినాథ్, వై.కనకేశ్వరరావు, రామకృష్ణ, శ్రీరామ్మూర్తి, ఎన్.అప్పారావు, గురువులు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా పెందుర్తి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కూడలిలో పతాకావిష్కరణ చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేపగుంట, సుజాతనగర్, నాయుడుతోట, గిరిప్రసాద్‌నగర్ కాలనీల్లోనూ జెండా ఎగురవేశారు. అసిరినాయుడు, పీలా ప్రకాశ్, వై త్రినాథ్, రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై నేడు వైసీపీ నిరసన

మల్కాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ మల్కాపురం బస్టాప్ వద్ద నుంచి ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రి ఎదురుగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వరకు శుక్రవారం ఉదయం ర్యాలీ నిర్వహించనున్నట్టట పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వంగవీటి మోహన్‌రంగాకు ఘన నివాళి



వంగవీటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

మల్కాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో గల అంజనేయస్వామి ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే, కాపు ఉద్యమ నేత వంగవీటి మోహన్‌రంగా వర్ధంతిని ఏడు వార్డుల టీడీపీ, జనసేనా, బీజేపీ కో-ఆర్డినేటర్ విశ్వనాథుల దినకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి విగ్రహనికి పూలమాలలు వేసి నివాళుల్పరించారు. అనంతరం దినకర్ మాట్లాడుతూ వంగవీటి రంగా ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని, కాపుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మితిరెడ్డి శంకర్, గురుమూర్తి, జి.రమణ, ఎల్.రామకృష్ణ, యు.కాశీ, రామారావు, గురు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా వర్ధంతిని వర్ధంతిని గురువారం స్థానిక వంగవీటి రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర మండలి అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మిలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి రంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలి ప్రతినిధులు ఇల్లపు ప్రసాద్, జి.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.శ్రీను, వి.నారాయణరావు, వెంకటరావు, బాబ్జీ, చందు, తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



జరీనా బేగం మృతదేహం

కూర్మన్నపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో ఓ మహిళ జారిపడి మృతి చెందింది. ఈ సంఘటన దువ్వాడ రైల్వే స్టేషన్ ఒకటో ప్లాట్‌ఫామ్‌లో గురువారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా వున్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్డాకి చెందిన జరీనా బేగం (44) గుండె వైద్యం కోసం బెంగళూరు బయలుదేరింది. చిన్న కుమార్తె, పెద్ద అల్లుడు, మరో బంధువుతో కలిసి హౌరా నుంచి బెంగళూరు వెళ్తున్న రైలులో ప్రయాణిస్తోంది. దువ్వాడ స్టేషన్లో రైలు ఆగడంతో తాగునీరు పట్టుకునేందుకు ఆమె కిందకు దిగింది. అయితే రైలు కదిలిపోతుండడంతో కంగారుగా రైలు ఎక్కేందుకు ప్రయత్నించి కాలుజారి పడిపోయింది. ప్రమాదంలో సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి దువ్వాడ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కోడింగ్‌పై పట్టు చిక్కేలా!

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హ్యాక్ క్లబ్

13 నుంచి 19 ఏళ్లలోపు వయసున్న వారికి అవకాశం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

కోడింగ్ అంటే సాధారణంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించిన అంశంగా అంతా భావిస్తారు. దీనిపై పట్టు ఉంటే మంచి ప్యాకేజీ వేతనాలు పొందవచ్చన్న భావన ఎంతోమందిలో ఉంది. ఈ భావనను తొలగించడంతోపాటు కోడింగ్ పట్ల అందరిలో ఆసక్తిని పెంపొందించేందుకు అమెరికాకు చెందిన జాస్ లట్టా హ్యాక్ క్లబ్ పేరుతో ఓ సంస్థను ప్రారంభించాడు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల విద్యార్థులకు కోడింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు పట్టు సాధించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- అనేక దేశాల్లో పనిచేస్తున్న ఆర్గనైజేషన్
- నగరంలోనూ జోరుగా కార్యక్రమాలు
- ఇటీవల కౌంటర్ స్పెల్ పేరుతో హ్యాకథాన్
- నాలుగు రకాల యాక్టివిటీస్ పరిచయం
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లోని వందకుపైగా నగరాల్లో హ్యాక్ క్లబ్ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, విశాఖలోనూ జోరందుకున్నాయి. కొద్దిరోజులు కిందట శ్రీశారదా విద్యా నిలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కౌంటర్ స్పెల్ హ్యాకథాన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఇందులో అనేక పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హ్యాకథాన్ నిర్వహణ బాధ్యత సభ్యులుగా ఉన్న విద్యార్థులే చూసుకోవడం గమనార్హం.

ఆ భావన దూరం చేయాలనే...

కోడింగ్ అంటే ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించిన అంశం అన్న భావనను దూరం చేయాలన్న ఉద్దేశంతోనే హ్యాక్ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం





ఆన్‌లైన్‌లో విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ అందిస్తున్న దృశ్యం

అనేక దేశాలకు చెందిన సుమారు లక్ష మంది విద్యార్థులు ఇందులో భాగస్వాములు. విశాఖకు చెందిన సుమారు వంద మంది ముందుకు సాగుతున్నారు. 13 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకు కోడింగ్ అంటే ఏమిటి..? ఎలా చేయాలన్న విషయాలను తెలియజేయడంతోపాటు ఎందుకు కోడింగ్ చేస్తున్నారు, దానివల్ల ఏం జరుగుతుందనే విషయాలపై అవగాహన కల్పిస్తాం. అంతేకాదు కోడింగ్ చేసేందుకు హ్యాక్ క్లబ్ సహకారాన్ని అందిస్తుంది. ఇందుకోసం వర్చువల్‌గా హ్యాక్‌క్లబ్‌లో భాగస్వాములుగా ఉన్న నిపుణులు విద్యార్థులకు వాట్సాప్ తరహాలో స్లాక్ అనే మీడియాను వినియోగిస్తున్నారు.

ఇవీ యాక్టివిటీస్

హ్యాక్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా పదుల సంఖ్యలో యాక్టివిటీస్ నిర్వహిస్తూ విద్యార్థులకు కోడింగ్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నారు. విశాఖలోని హ్యాక్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నాలుగు రకాల యాక్టివిటీస్‌ను నిర్వహించారు. ఇందులో మొదటిది హైసిస్. ఇందులో విద్యార్థులు తమ ఆలోచనలకు అనుగుణంగా ప్రాజెక్టులను డిజైన్ చేశారు. దానికి అనుగుణమైన సాఫ్ట్‌వేర్‌ను కోడింగ్ చేస్తారు. మంచి ప్రాజెక్ట్‌గా భావిస్తే వారికి హ్యాక్ క్లబ్ నుంచి రివార్డులను అందించి ప్రోత్సహిస్తారు. రెండోది కౌంటర్ స్పెల్. కొద్దిరోజుల కిందటే కౌంటర్ స్పెల్‌లో భాగంగా హ్యాకథాన్ నిర్వహించారు. ఇందులో భాగం గా వారికి ఇచ్చే కొన్నిరకాల ప్రోబ్లమ్స్‌ను పిల్లలు గ్రూపులుగా విడిపోయి కోడింగ్ ద్వారా సబ్‌మిట్ చేస్తారు. ఇందులో విజేతలకు బహుమతులను అందిస్తారు. మూడో యాక్టివిటీ స్ప్రింగ్ కన్సోల్. ఇందులో తమకు నచ్చిన గేమ్స్‌ను కోడింగ్ ద్వారా డిజైన్ చేయవచ్చు. కోడింగ్ కరెక్ట్‌గా ఉంటే అందుకు అనుగుణమైన పరికరాలను తయారుచేసి పంపిస్తారు. ఈ పార్టులను ఏకంచేసి గేమింగ్ పరికరాన్ని రూపొందిస్తారు. నాలుగోది ఆన్‌బోర్డు. ఇందులో ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ను విద్యార్థులు డిజైన్ చేస్తారు. కంప్యూటర్‌లో వారి ఆలోచనలకు అనుగుణంగా డిజైన్ చేసి, పనితీరుకు సంబంధించిన కోడింగ్ పంపిస్తారు. ఈ ఎలక్ట్రానిక్ సర్క్యూట్స్‌ను ఉత్పత్తిచేసి అమెరికాలోని కేంద్ర కార్యాలయం నుంచి పంపిస్తారు. వీటిలో ఏసీటూ డీసీ కన్వర్టర్స్, ఆఫీసుల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వినియోగిస్తున్న కార్డ్స్, యూఎస్‌బీ తయారుచేసేలా గైడెన్స్ ఇస్తున్నారు. వీటితోపాటు కోడింగ్ ద్వారా ఎటువంటి యాక్టివిటీస్ చేయవచ్చు అనే అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు.

ఎలాన్ మస్క్ చేయూత..

హ్యాక్ క్లబ్‌కు ప్రపంచ ప్రఖ్యాత టెస్లా సంస్థ అధినేత ఎలాన్ మస్క్ సుమారు రూ.40 కోట్ల సాయాన్ని అందించారు. విద్యార్థుల్లోని విభిన్న ఆలోచనలను ప్రోత్సహించి వెలికితీసే విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. డెల్ టెక్నాలజీస్‌తోపాటు మరిన్ని దిగ్గజ సంస్థలు రెండు నుంచి ఐదు మిలియన్ డాలర్ల సాయాన్ని అందించాయి.

క్రైం... crime news

బాలుడి ప్రాణం తీసిన ఈత సరదా



ధీరజ్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):క్రిస్మస్ పురస్కరించుకుని స్నేహితుడితో కలిసి చర్చికి వెళతానని ఇంటి నుంచి వెళ్లిన బాలుడు నీటి మడుగులో శవమై కనిపించాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చినముషిడివాడ వుడా కాలనీ శివారు పెందుర్తి నల్లక్వారీకి 30 ఏళ్ల కిందట నేపాల్‌కు చెందిన పలు కుటుంబాలు వలస వచ్చాయి. ఇందులో అర్జున్ ప్రదాన్ పెందుర్తిలోని ఓ ప్లాస్టిక్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడి కుమారుడు ధీరజ్ ప్రదాన్ (12) స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. క్రిస్మస్ సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితుడితో కలిసి చర్చికని బుధవారం వెళ్లాడు. అనంతరం మరికొంతమంది స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు పెందుర్తిలోని నల్ల క్వారీ నీటిమడుగుకు వెళ్లారు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో అర్జున్ ప్రదాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ సతీశ్‌కుమార్ విచారణ చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా, నల్లక్వారీ నీటి మడుగు సమీపంలో గల బిగ్ బాస్కెట్ షెడ్డు వద్ద బాలుడు విడిచిపెట్టిన దుస్తులు, చెప్పులు కనిపించాయి. దీంతో నీటి మడుగులో బాలుడి కోసం గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. అతడి స్నేహితుడిని విచారించగా.. ఈత కొట్టేందుకు నలుగురం వచ్చినట్టు చెప్పాడు. ఈత కొడుతూ ధీరజ్ మునిగిపోవడంతో భయంతో పారిపోయినట్టు వివరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి సీఐ సతీశ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

ఎండాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ పనోరమ హిల్స్ ప్రాంతంలో మద్యం మత్తులో వ్యక్తి మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సీపాన నాగేశ్వరరావు (39) మధురవాడలోని కేటరింగ్ చేసే వారి దగ్గర పని చేస్తుంటాడు. ఆయన మద్రిపాలెం లక్ష్మీనగర్‌లో భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం కూడా పూటుగా మద్యం తాగి పని కోసం మధురవాడ వెళ్లగా తాగి ఉండడంతో వారు పంపించివేశారు. ఈమేరకు లా కళాశాల వద్దకు వచ్చి అక్కడ ఉన్న ఆటోలో కూర్చొని మృతి చెందాడు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో 18 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని రూ.90 వేలు విలువ చేసే 18 కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నామని రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్‌ఐలు ఎస్‌కె.అబ్దుల్‌మరూఫ్, పీఆర్ బిశోయి తనిఖీలు చేస్తుండగా ముంబైకి సచిన్ శివాజీ గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఉత్తరప్రదేశ్‌పై తమిళనాడు విజయం

విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు 114 పరుగుల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన తమిళనాడు నిర్ణీత 47 ఓవర్లలో ఐదు వికెట్లకు 284 పరుగులు చేసింది. షారూక్ ఖాన్ అజేయ సెంచరీ (132 నాటౌట్), ఎస్.మహ్మద్ అలీ అజేయ అర్ధ సెంచరీ (76 నాటౌట్) సాధించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్ యాష్ దయాల్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్ 32.5 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటయింది. తమిళనాడు బౌలర్లు వారియర్, వరుణ్, విజయ్‌శంకర్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

పలాస, విజయనగరం మెము రైళ్లు పునరుద్ధరణ

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలాస, విజయనగరం మెము రైళ్లను పునరుద్ధరించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే విశాఖ, విజయనగరం మధ్య రైలు సర్వీసులను తాత్కాలికంగా పార్వతీపురం వరకు పొడిగించామన్నారు. విశాఖ-పలాస మెము పాసింజర్ ఈనెల 28 నుంచి మార్చి ఒకటి వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. పలాస-విశాఖ మెము పాసింజర్ ఈనెల 28 నుంచి మార్చి ఒకటి వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విశాఖ-విజయనగరం మెము పాసింజర్‌ను పార్వతీపురం వరకు పొడిగించారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 28 వరకు గురువారం మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విజయనగరం-విశాఖ పాసింజర్ ఈనెల 28 నుంచి మార్చి ఒకటి వరకు శుక్రవారం మినహా పార్వతీపురంలో బయలుదేరి విశాఖ చేరుతుంది.

అమృతసర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ, అమృతసర్ మధ్య నడుస్తున్న హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా తాత్కాలిక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-అమృతసర్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి, అమృతసర్-విశాఖ ఎక్స్ ప్రెస్ రైలుకు 29 నుంచి అందుబాటులో ఉంటుందన్నారు.

ఉద్యోగాల భర్తీ పేరుతో నకిలీ ఫోన్ కాల్

- దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఏడీ దృష్టికి తీసుకెళ్లిన అభ్యర్థులు

పెదవాల్తేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల తుది జాబితా తయారు చేస్తున్నారని, అందులో మీ పేరుందని, ఉద్యోగం కావాలంటే ఫోన్ పే లేదా బ్యాంకు అకౌంట్‌లో కొంత మొత్తం వేయాలంటూ ఓ వ్యక్తి 89612 47386 నంబరు నుంచి కాల్ చేస్తున్నాడని దివ్యాంగులు తమ దృష్టికి తెచ్చినట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జె.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియామకాలు పారదర్శకంగా జరుగుతాయని, ఇలాంటి మోసకారి మాటలకు ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఫేక్ కాల్స్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గంగమ్మతల్లికి మత్స్యకారుల పూజలు



పెదజాలారి పేట తీరానికి చేరుకున్న మత్స్యకారులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి



తీరంలో పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

పెదవాల్తేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లీ చల్లగా చూడమ్మా అంటూ మత్స్యకార మహిళలు వేడుకున్నారు. 2004 డిసెంబరు 26న వచ్చిన సునామీ లాంటి భయంకర విపత్తులు మళ్లీ సంభవించకుండా చూడాలని కోరుకుంటూ ఆ మరుసటి ఏడాది నుంచి ఇలా పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మత్స్యకారులంతా గురువారం కలశాలతో ఊరేగింపుగా పెదజాలారిపేట బీచ్‌కు చేరుకుని సంద్రానికి పూజలు చేశారు. వేలాదిమంది మహిళలు నీళ్లు, పాలు, పసుపు నీటిని కలశాలతో నింపి శిరస్సున దాల్చి తీరానికి చేరుకున్నారు. కలశాల్లోని నీరు, పాలతో సముద్రానికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మతల్లీ మరోసారి కన్నెర్ర చేయకమ్మా అని వేడుకున్నారు. పెదజాలారిపేట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వేలాదిమంది మహిళలు శిరసున దాల్చిన కలశాలతో ఊరేగింపుగా తీరానికి చేరుకున్నా రు. తమకు సముద్రమే జీవనాధారమని, ఆగ్రహించకుండా అనుగ్రహం చూపాలని కోరుకున్నారు. వేలాదిగా బీచ్‌కు చేరుకోవడంతో తీరం జన సంద్రమయింది. మత్స్యకార గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగ పూడి రామకృష్ణబాబు గంగమ్మకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్న, టీడీపీ నేత బైరెడ్డి పోతన్నరెడ్డి, తెడ్డు పరసన్న, తెడ్డు శతయ్య, తెడ్డు రాజు, బాపిరాజు, తెడ్డు పోలారావు, రమోలు వీరాజు, తేజ, పోలీసు, మత్స్యకార పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి సమర్పించేందుకు సిద్ధం చేసిన 1008 కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు



అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

జగదాంబ కూడలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర గురువారం సందర్భంగా కలశాభిషేకం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. టౌన్ కొత్తరోడ్డు నుంచి ఆలయం వరకు క్యూలైన్లు కిక్కిరిపోయాయి. దర్శనానికి మూడు, నాలుగు గంటల సమయం పట్టడంతో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బుధవారం అర్ధరాత్రి పంచామృతాభిషేకం, జలాభిషేకం చేసిన అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. ఆలయంలో సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి కలశపూజ నిర్వహించారు. 1008 కలశాలకు పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో పాల్గొనేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం కలశాలను జలంతో నింపిన భక్తులు అమ్మవారికి అభిషేకించారు. రాత్రి ఏడు గంటల తర్వాత తిరిగి దర్శనాలకు అనుమతించారు.

బీచ్ రోడ్డులో కమ్యూనిస్టుల కవాతు

- ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం

రామ్‌నగర్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతవార్షికోత్సవం సందర్భంగా గురువారం బీచ్ రోడ్డులో ఎర్ర కవాతు నిర్వహించారు. వందమీటర్ల ఎర్ర జెండాతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పోరాటాల స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం కాపాడేందుకు శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు బ్రిటిష్ పాలకులు కమ్యూనిస్టులపై నిషేధం విధించి, నాయకులపై కేసులు నమోదు చేసినా భయపడలేదన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఆటవీహక్కులు, సమాచార హక్కు, ఉపాధి హామీ చట్టాలను తీసుకురావడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రాఘవేంద్రరావు, ఏజే స్టాలిన్, పైడిరాజు అచ్యుతరావు, విమల, ఎస్‌కే రెహమాన్, జేడీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



శత వార్షికోత్సవం సందర్భంగా కవాతు నిర్వహిస్తున్న దృశ్యం



వంద మీటర్ల సీపీఐ జెండాతో ర్యాలీ చేస్తున్న నాయకులు